

# నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 287 | మంగళవారం 27 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,




## హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..



- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర
- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ

2లో

## ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం:

విజయవాడలో ఎన్టీఆర్ వర్సిటీ 40వ వార్షికోత్సవం

ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడిన ఉపరాష్ట్రపతి

2లో



## తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తుపై కీలక చర్చలు..



- 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి తెలంగాణ ప్రతిపాదన
- 148 మీటర్లకే గతంలో మహారాష్ట్ర అంగీకారం..
- తాజా చర్చల్లో ఎత్తు, నీటి లభ్యత, ముంపుపై ప్రధానంగా దృష్టి

2లో

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించే దిశగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన కీలక అంశాలపై ఇరు రాష్ట్రాల ప్రతినిధులు చర్చలు జరుపుతున్నారు.

### 152 మీటర్ల ఎత్తుకు తెలంగాణ ప్రతిపాదన

తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించినట్లు తెలంగాణ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించడమే ప్రస్తుత చర్చల్లో ప్రధాన అంశంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## ఓటు చోరీ అంటున్న కాంగ్రెస్.. అధికారంలోకి ఎలా వచ్చింది?

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం: ఎంపీ డీకే అరుణ

శంకుస్థాపనలకే పరిమితమైన పేటమక్తల్ రోడ్డు పనులు

2లో



## ఖర్గే వ్యాఖ్యలపై రాంచందర్ రావు ఆగ్రహం

కాంగ్రెస్‌పై బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శలు

పాట్నా సభలో ఏం జరిగింది?

దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం

2లో



## 'ఆర్నబ్'పై మరింత అప్రమత్తం

## ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు

'ఆర్నబ్' తుఫాన్ ముంచుకొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేస్తూ అధికారులకు సీఎం చంద్రబాబు పలు ఆదేశాలిచ్చారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో విద్యా సంస్థలకు స్థానికంగా సెలవులు ప్రకటించాలని స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావంపై సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిన వారిపై కఠినంగా వ్యవహరించాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం ఉండవల్లి క్యాంప్ కార్యాలయం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో తుఫాన్ పరిస్థితిని సీఎం వర్చువల్‌గా సమీక్షించారు. ఆర్నబ్ తుఫాన్ మంగళవారానికల్లా తీవ్ర తుఫాన్‌గా మారి రాష్ట్రంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరికలతో తీర ప్రాంత జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం చెప్పారు. బుధవారానికి తుఫాన్ యానాం వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. తుఫాన్ కారణంగా మంగళవారం నుంచి 28, 29 తేదీల వరకు కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.



ప్రతి 4 గంటలకూ బులెటిన్లు.. అలర్ట్ మెస్సేజ్‌లు

తీర జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలి

తుఫాన్ పరిస్థితిపై అధికారులతో సీఎం సమీక్ష



## 290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు..

2లో

## 'నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?'

## సొంత ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫైర్!

సొంత ప్రభుత్వంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసంతృప్తి

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్

30 వేల మందితో దీక్షకు సిద్ధమని ప్రకటన

మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులా? అంటూ ప్రశ్న

సాగునీటి కోసం పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తామని వెల్లడి

2లో

సొంత ప్రభుత్వంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అసంతృప్తి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ 30 వేల మందితో దీక్షకు సిద్ధమని ప్రకటనా మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులా? అంటూ ప్రశ్న సాగునీటి కోసం పార్టీలకు అతీతంగా



## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గుడ్ న్యూస్..

2లో

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నిర్మాణం పూర్తిచేసుకుని ఫైనల్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి త్వరలోనే ఆ మొత్తాన్ని జమ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఇల్లు పూర్తయినా ఫైనల్ బిల్లు ఇంకా రాలేదని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.రాష్ట్రంలోని నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున, మొత్తం రూ.40 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని అర్హులైన పేదలు నిరాశ చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం దశలవారీగా ఈ పథకాన్ని అమలు చేస్తుందని,



ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు త్వరలో జమ

లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్న మంత్రి పొంగులేటి

రూ.40 వేల కోట్లతో 8 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

తరువాతి విడతల్లోనూ అర్హులకు ఇళ్ల కేటాయింపు

## అర్నాబ్ ఎఫెక్ట్.. పాపికొండలు విహారయాత్రకు బ్రేక్



అర్నాబ్ తుపాన్ ముప్పుతో పాపికొండల యాత్ర తాత్కాలికంగా రద్దు

సోమవారం నుంచి బోట్ల రాకపోకలను నిలిపివేస్తూ అధికారుల ఆదేశాలు

వాతావరణం అనుకూలించాకే మళ్లీ అనుమతిస్తామని వెల్లడి

2లో

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నాబ్' తుపాను హెచ్చరికల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాపికొండల విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈరోజు నుంచి గోదావరి నదిలో

## రాహుల్ గాంధీకి కోర్టులో భారీ ఊరట..

## అమిత్ షా కేసులో కీలక తీర్పు!



అమిత్ షాపై వ్యాఖ్యల కేసులో రాహుల్ నిర్దోషిగా తీర్పు

రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కాదని కోర్టు స్పష్టీకరణ

2018 కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ఈ వ్యాఖ్యలు

బీజేపీ నేత విజయ్ మిశ్రా ఫిర్యాదుతో విచారణ

2లో

2023లో కోర్టుకు హాజరై బెయిల్ పొందిన రాహుల్

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి కోర్టులో ఊరట లభించింది. 2018లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించింది.

# ఖర్గే వ్యాఖ్యలపై రాంచందర్ రావు ఆగ్రహం

ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా స్పందించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడు ఇలాంటి భాష ఉపయోగించడం విచారకరమని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు అధికారానికి దూరంగా ఉండటంతో నిరాశ, అసహనంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారుహైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు.. గత పన్నెండున్నరేళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నాయకుల్లో అసహనం పెరిగిందని అన్నారు. ఆ నిరాశతోనే ప్రధాని మోదీని, ఆయన తండ్రిని ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఖర్గే ప్రసంగించిన కార్యక్రమంలో వేదికపై ఉన్న నాయకుల సంఖ్యతో పోలిస్తే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఎద్దేవా చేశారు.బీహార్ రాజధాని పాట్నాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా.. సభలో ఉన్న ఓ వ్యక్తి ప్రధాని మోదీ ఓడిపోరంటూ వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన ఖర్గే.. "మోదీ కా బాప్ భీ జాయేగా" అంటూ వ్యాఖ్యానించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ ఘటన అక్టోబర్ 25న బీహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ 139వ జయంతి కార్యక్రమంలో చోటుచేసుకుంది. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఈ వ్యాఖ్యలను విమర్శించారు. మరోవైపు, ఈ వ్యవహారంపై పాట్నాలోని కోత్వాలి పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేత ఫిర్యాదు చేశారు. దీంతో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ విమర్శలు మరింత తీవ్రమయ్యాయి.

# 'నేను చస్తేనే బిల్లులు ఇస్తారా?'..

పోరాటం చేస్తామని వెల్లడి తెలంగాణలో సొంత ప్రభుత్వంపైనే కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లులు విడుదల చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను చస్తే గానీ బిల్లులు చెల్లించరా? అంటూ ప్రశ్నించారు. అవసరమైతే 30 వేల మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన అనిరుధ్‌రెడ్డి సోమవారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డిగూడ, గుండ్లపొట్లపల్లి సహా పలు గ్రామాల్లో పర్యటించారు. స్థానికుల సమస్యలను తెలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. తన నియోజకవర్గంలో పూర్తయిన పనులతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**మంత్రుల నియోజకవర్గాలకే బిల్లులు చెల్లిస్తారా?** ప్రభుత్వం, సచివాలయం తీరుపై అనిరుధ్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రుల నియోజకవర్గాల్లోనే బిల్లులు చెల్లిస్తారా? మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల ఓ కాంట్రాక్టర్ చనిపోయిన తర్వాత ఆయనకు రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తన నియోజకవర్గ పనుల బిల్లుల కోసం తాను చనిపోతేనే నిధులు విడుదల చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నీళ్ల కోసం పార్టీలకు అతీతంగా పోరాటం**రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు సమానంగా అభివృద్ధి చెందితేనే ప్రభుత్వం నిలబడుతుందని అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు పార్టీలకు అతీతంగా పోరాడతామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంతదూరమైనా వెళతానని చెప్పారు. తన నియోజకవర్గానికి రావాల్సిన నిధులు, పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# 290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు..

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ కీలక మైలురాయిని చేరుకుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు ఇప్పటివరకు ఏకంగా రూ.10,000 కోట్లకు పైగా ఆదా చేసుకున్నారని టీజీఎస్‌ఆర్టీసీ వెల్లడించింది. పథకం ప్రారంభమైన నాటి నుంచి సుమారు 28 నెలల్లో 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజూ 35 లక్షల మందికి పైగా మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. దీనివల్ల టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల వాటా 40 శాతం నుంచి 67 శాతానికి పైగా పెరిగింది. మహిళల నుంచి వస్తున్న భారీ స్పందనతో మొత్తం ఆక్యుపెన్సీ రేటు కూడా 69 శాతం నుంచి 98 శాతానికి చేరడం విశేషం. తాము అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించామని ప్రభుత్వం పలు సందర్భాల్లో గుర్తుచేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ... మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణం మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు, స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గిందని, వారు విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని తెలిపారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని బస్సు సర్వీసులను నడిపేందుకు టీజీఎస్‌ఆర్టీసీ చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

# బాణాసంచా విక్రయాలకు తాత్కాలిక అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోండి

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, తెలిపారు. దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ జారీ చేసిన ఎన్‌ఓసీ, స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి అనుమతి పత్రం, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, గతంలో లైసెన్స్ ఉంటే దాని ప్రతితో పాటు, అవసరమైన చోట్ల పక్క స్థల యజమానుల అనుమతి పత్రాలు, సైట్ ప్లాన్ బ్లూప్రింట్ సమర్పించాలి. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆధాలత్ శాఖలో ప్రభుత్వ ఖజానాకు రూ.800 చెల్లించిన బ్యాంక్ చలాన్‌ను జతచేయాలి.దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత డీసీపీ స్థాయి అధికారులు నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేస్తారని తెలిపారు.ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గుడ్ న్యూస్..

మూడు, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ప్రకటనతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని, తుది చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్న వేలాది పేద కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. త్వరలోనే తమ ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతాయన్న నమ్మకం వారిలో వ్యక్తమవుతోంది.

# రాహుల్ గాంధీకి కోర్టులో భారీ ఊరట..

రాహుల్ చేసిన వ్యాఖ్యలు పరువునష్టం కలిగించేలా లేవని కోర్టు స్పష్టం చేసింది. సోమవారం తీర్పు వెలువడిన సమయంలో రాహుల్ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు.

**కర్ణాటక ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యలు** 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో బెంగళూరులో జరిగిన సభలో అమిత్ షాపై రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తిపై హత్య కేసు ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు అమిత్ షా ప్రతిష్ఠకు భంగం కలిగించాయని ఆరోపిస్తూ బీజేపీ నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టు 4న సుల్తాన్‌పుర్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో రాహుల్‌పై క్రిమినల్ పరువునష్టం కేసు నమోదైంది.

**ఐదేళ్లకు పైగా సాగిన న్యాయపోరాటం** ఈ కేసులో విచారణకు హాజరు కావాలని 2023లో కోర్టు రాహుల్‌ను ఆదేశించింది. అనంతరం ఆయన కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. రాహుల్ ప్రసంగానికి సంబంధించిన వాయిస్ నమూనాను పోల్చాలని ఫిర్యాదుదారు కోరినా, దిగువ కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ చేసిన పిటిషన్లను కూడా పైకోర్టులు కొట్టివేశాయి. తాజాగా తుది తీర్పు వెలువరిస్తూ రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం పరిధిలోకి రావని కోర్టు పేర్కొంది.

# అర్నాబ్ ఎఫెక్ట్.. పాపికొండలు విహారయాత్రకు బ్రేక్

పర్యాటక బోట్ల రాకపోకలను పూర్తిగా రద్దు చేస్తూ రంపచోడవరం సబ్-కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.తుపాను ప్రభావంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాజమండ్రి, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి సర్వీసులు నడిపే సుమారు 16 పర్యాటక బోట్లను నిలిపివేశారు. గతంలో గోదావరికి వచ్చిన భారీ వరదల కారణంగా సుమారు 70 రోజుల పాటు నిలిచిపోయిన పాపికొండల యాత్ర, కేవలం రెండు వారాల క్రితమే తిరిగి ప్రారంభమైంది. అప్పుడే పర్యాటకుల రాక కూడా పుంజుకుంటోంది. ఆదివారం ఒక్కరోజే మూడు బోట్లలో దాదాపు 199 మంది పర్యాటకులు పాపికొండల అందాలను వీక్షించారు. ఇంతలోనే తుఫాన్ ముప్పు రావడంతో యాత్రకు మరోసారి బ్రేక్ పడింది. తుపాన్ ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారితేనే బోటింగ్ సేవలను పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టం చేశారు. పర్యాటకులు ప్రస్తుతానికి గోదావరి నదీ ప్రాంతాలకు రావొద్దని సూచించారు.

## ఇంటికి వెళ్తూ జాయింట్ డైరెక్టర్ కారులో

# రూ.2.40 లక్షలు

## ఏసీబీ తనిఖీల్లో లెక్కల్లో చూపని నగదు స్వాధీనం

**హైదరాబాద్ అక్టోబర్ 26 (నమస్తే జ్యోతి క్రైం ):** హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ (ఎవీబొ&ూదీ) కార్యాలయానికి చెందిన ఓ ఉన్నతాధికారి వద్ద లెక్కల్లో చూపని నగదు లభ్యమైంది. అక్రమంగా వసూలు చేసిన నగదును తీసుకుని ఆయన ఇంటికి వెళ్తున్నారన్న సమాచారంతో ఏసీబీ సిటీ రేంజ్-2 అధికారులు నిఘా ఏర్పాటు చేశారు.ఈ క్రమంలో ఈ నెల 24న రాత్రి 7 గంటల సమయంలో రాజ్‌భవన్ రోడ్డులోని మెట్రో రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా ూ08 ఈు 3699 నంబరు గల మారుతీ స్విఫ్ట్ కారును అధికారులు అడ్డగించారు. ఆ కారు హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ ఖైరతాబాద్‌లో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఏ. శ్రీనివాస్‌కు చెందినదిగా గుర్తించారు.కారులో తనిఖీలు నిర్వహించగా ఆయన వద్ద రూ.2,40,000 నగదు లభించింది. కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో అంతమొత్తంలో నగదు ఎందుకు తీసుకెళ్తున్నారనే విషయంపై అధికారులు ఆరా తీశారు. నగదుకు సంబంధించి ఆయన సంతృప్తికరమైన వివరణ ఇవ్వకపోగా, పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. దీంతో లెక్కల్లో చూపని రూ.2.40 లక్షల నగదును పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించి అవినీతి కోణంలో విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవడంతోపాటు ఆదాయపు పన్ను శాఖకు సమాచారం అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

## హైదరాబాద్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసు: ఐదు నెలల తర్వాత నేపాలీ ముఠా అరెస్ట్

హైదరాబాద్ నగరంలో తీవ్ర సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రే వినయ్ రంజన్ భార్య తనుజా రంజన్ హత్య కేసులో ఐదు నెలల తర్వాత కీలక పురోగతి లభించింది. ఈ దారుణానికి సూత్రధారిగా వ్యవహరించిన ఇంట్లోని పనిమనిషి ధర్మ అలియాస్ కల్పన సహా నలుగురు నేపాలీ నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (ూ×ు) దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో, భారత్-నేపాల్ సరిహద్దుల్లో ఐదు నెలల పాటు గాలించి నిందితులను కదలికలను గుర్తించారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం మీడియా సమావేశంలో ఈ అరెస్టుల వివరాలను వెల్లడించారు. నిందితులైన ధర్మ అలియాస్ కల్పన (26), గణేశ్ బి.కె (31), చంద్ర బహదూర్ థమన్ (44), గణేశ్ బహదూర్ షాహి (37)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు.

**పక్కా ప్రణాళికతో దోపిడీ, హత్య**పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మే 7, 8 తేదీల మధ్య రాత్రి ప్రశాసన్ నగర్‌లోని తనూజ రంజన్ నివాసంలోకి చొరబడిన నిందితులు, ఆమెను కదలకుండా బంధించి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఇంట్లోని 225 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులతో పరారయ్యారు.ఈ కేసులో ఇంట్లో పనిచేసే ధర్మ తిరువా అలియాస్ కల్పన (26) కీలక పాత్ర పోషించింది. నేపాల్‌లోని సుర్ఖేత్ జిల్లాకు చెందిన కల్పన, జూన్ 2025లో బంధువుల ద్వారా హైదరాబాద్ వచ్చి, నెలకు రూ. 20,000 జీతానికి తనూజ ఇంట్లో పనికి కుదిరింది. పనిలో చేరినప్పటి నుంచి పుణెలో ఉంటున్న బికాస్ అనే నేపాల్ జాతీయుడితో ఆమె టచ్‌లో ఉంది. యజమానురాలి ఇంట్లో ఉన్న ఆస్తులు, నగదు, బంగారు ఆభరణాల గురించి బికాస్ తరచూ అడిగి తెలుసుకునేవాడు. ఇంట్లో దోపిడీకి సహకరిస్తే వాటా ఇస్తానని ఆశ చూపడంతో కల్పన అంగీకరించింది.

**నేరానికి ముందు ఏం జరిగింది?** ఏప్రిల్ 2026లో అనారోగ్యంతో ఉన్న తన తండ్రిని చూసేందుకు పుణే వెళ్లిన కల్పన, అక్కడ ఈ ముఠాలోని ఇతర సభ్యులను కలుసుకుంది. మే 4న యజమానురాలు తనూజ బెంగళూరు వెళ్తున్నట్టు తెలియగానే, కల్పన వెంటనే ముఠాకు సమాచారం ఇచ్చింది. దీంతో మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో గణేశ్ బహదూర్ షాహి, శంకర్ చంద్ర లామా, సునీల్ పరియార్ సమావేశమై, అద్దెకు తీసుకున్న మారుతి ఎర్టిగా కారులో పుణే చేరుకున్నారు. అక్కడ మరికొందరితో కలిసి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. మే 7న ఉదయం, గణేష్ బి.కె., సురేష్ షాహి అనే ఇద్దరు నిందితులు కల్పనను కలిసి ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇంట్లోకి ఎలా ప్రవేశించాలనే దానిపై చర్చించుకున్నారు.

# 'ఆర్నబ్'పై మరింత అప్రమత్తం

అలాగే తీరప్రాంతం వెంబడి బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. తుఫాన్‌పై గంట గంటకూ అధికారుల నుంచి సమాచారం తీసుకుంటున్న సీఎం.. కలెక్టర్లు, అధికారులకు కీలక సూచనలు చేశారు. తుఫాన్ గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రతి 4 గంటలకూ ప్రజలకు, రైతులకు హెచ్చరికలతో కూడిన బులెటిన్‌ను జారీ చేయాలన్నారు. అలెర్ట్ మెసేజీలు పంపాలని చెప్పారు. తుఫాన్ విషయంలో రాష్ట్రం తీసుకుంటున్న ముందస్తు చర్యలను ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

**ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు**ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సీఎం చెప్పారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను తుఫాన్ షెల్టర్లకు తరలించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు, శిశువులకు తొలి ప్రాధాన్యత ఇచ్చి, సురక్షిత ప్రాంతాలకు వారిని చేర్చాలని చెప్పారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య బృందాలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. రాష్ట్రంలో 7 ఎన్డీఆర్ఎఫ్, 8 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను 11 ప్రభావిత జిల్లాల్లో మోహరించినా, ఎన్టీఆర్, విశాఖ జిల్లాల్లో అదనపు బలగాలను రిజర్వ్‌లో ఉంచాలని చెప్పారు. మెరైన్ పోలీసులతో పాటు నౌకాదళం, కోస్ట్‌గార్డుల సేవలను కూడా సహాయక చర్యల్లో వినియోగించుకోవాలని అన్నారు.సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ సురక్షితంగా వెనక్కి రప్పించాలని, సముద్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వారు వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వరికోతలైన చోట్ల ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు చేర్చాలన్నారు. దాదాపు 1.82 లక్షల హెక్టార్లలోని ఉద్యాన పంటలకు తుఫాన్ ముప్పు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రేషన్ దుకాణాల్లోనూ సరుకులు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే, తక్షణమే పునరుద్ధరించేలా చూడాలని చెప్పారు.

**వరద నీటిని నిల్వ చేయాలి** భారీ వర్షాలతో మొత్తం 22 రిజర్వాయర్ల పరిధిలో వరద ప్రవాహాలు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఈప్రవాహాలతో 10-12 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా చూడాలని జలవనరులశాఖను సీఎం ఆదేశించారు. తాండవ, రైవాడ, ఏలేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ, తాడిపూడి రిజర్వాయర్లకు పూర్తి స్థాయిలో నీటి నిల్వలు వచ్చే అవకాశం ఉందని సీఎం అన్నారు. వాగులు, వంకలు, కాలువల ప్రవాహాలకు అడ్డంకి లేకుండా చూడాలని సూచించారు. తుఫాన్ నేపథ్యంలో మొత్తం 30,043 పడవలను సురక్షితంగా హార్బర్లకు చేరుకున్నాయని మత్స్యశాఖ అధికారులు వివరించగా, రాష్ట్రవ్యాప్తంగా 4,711మంది గర్భిణులను ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, ఆసుపత్రులకు తరలించే ప్రక్రియ కొనసాగుతోందని వైద్యఆరోగ్యశాఖ అధికారులు వివరించారు.

# హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..

తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో - అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి - అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్‌ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్‌ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు.నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం

భవిష్యత్తులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్సిటీ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు అందించిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించిన ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు.ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కొత్త పరిష్కారాలు కనుగొనేందుకు వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో రాణించాలని సూచించారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, వైద్యులు మానవత్వాన్ని ఎన్నడూ మరువరాదని ఆయన హితవు పలికారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం, ఆత్మీయత చూపడమే వైద్య వృత్తిలో అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దాని దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్యులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తుపై కీలక చర్చలు..

**నీటి లభ్యత, ముంపు ప్రభావంపైనా చర్చ** బ్యారేజీ ఎత్తు పెంపుతోపాటు నీటి లభ్యత, భూసేకరణ, ముంపు ప్రభావం వంటి అంశాలపై ఇరు రాష్ట్రాల అధికారులు చర్చిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, రెండు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిష్కార మార్గాలను అన్వేషించే దిశగా సమావేశం సాగుతోంది. అయితే చర్చల్లో తీసుకున్న తుది నిర్ణయాలు, మహారాష్ట్ర ప్రభుత్వం వైఖరిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**ఉన్నతాధికారుల హాజరు**

ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు (సీఎస్‌లు), నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తు విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే ప్రాజెక్టు తదుపరి కార్యాచరణకు మార్గం సుగమమయ్యే అవకాశం ఉంది. తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై ఈ సమావేశంలో కీలకమైన చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం ప్రారంభంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ద్వారా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర ప్రతినిధి బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్ బీ చవాన్ గారి మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో జరుగుతున్న ప్రయత్నాలను తెలిపారు. 5 దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని మంత్రి తన ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి గారు స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

# ఓటు చోరీ అంటున్న కాంగ్రెస్.. అధికారంలోకి ఎలా వచ్చింది?

ఓటు చోరీ పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని, ఓటు చోరీ జరుగుతోందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ తెలంగాణలో ఎలా అధికారంలోకి వచ్చిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. సోమవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని ఊట్కూర్, బిజ్వార్, పెద్ద జట్రం గ్రామాల్లో ఎంపీ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఊట్కూర్ మండల కేంద్రంలోని ఎల్‌బీనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన ఓపెన్ షెడ్డును ప్రారంభించారు. అనంతరం పెద్ద జట్రం, బిజ్వార్ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. **కేంద్ర నిధులతోనే అభివృద్ధి పనులు** కేంద్ర ప్రభుత్వం నిధులతో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో పెద్ద ఎత్తున జాతీయ రహదారుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని డీకే అరుణ తెలిపారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులే ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు వీబీజీ రామ్‌జీ నిధులు వినియోగిస్తున్నామని, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్నామని వివరించారు.

**శంకుస్థాపనలకే పరిమితమైన పేటమక్తల్ రోడ్డు పనులు** నారాయణపేటమక్తల్ రహదారి పనుల విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులు పలుమార్లు శంకుస్థాపనలు చేసి వెళుతున్నప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని ఎంపీ విమర్శించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ కావడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. బిల్లులు సకాలంలో అందక కాంట్రాక్టర్లు అప్పులపాలవుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక నిర్వహణలో విఫలమైందని విమర్శించారు.

**ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నలు** ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేసిందని డీకే అరుణ ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేశారా అని నిలదీశారు.

# ఆళ్లగడ్డలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 26 నంది పత్రిక** పట్టణంలో సోమవారం వాల్మీకిసంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతివేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నాలుగురోడ్లకూడలి సమీపంలో ఉన్న వాల్మీకిమహర్షి విగ్రహం వద్దకు వాల్మీకులు తరలివచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకొని వాల్మీకి విగ్రహాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. వస్త్రాలంకరణతో వాల్మీకి విగ్రహాము ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వాల్మీకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొని వాల్మీకిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. అర్చకుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం హాజరైన వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వాల్మీకి సంఘ నాయకుడుమాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని అందించిన వాల్మీకి నమస్తమానవాళికి ఆదర్శమని కొనియాడారు. వాల్మీకి మహర్షి లాంటి మహానీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని వారిమార్గంలో లక్ష్యాలను సాధించాలని సూచించారు. మహనీయుని జయంతిని జరువుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మానవతా విలువలు, ఆదర్శభావాలను బోధించే రామాయణాన్ని రచించిన వాల్మీకి ప్రపంచానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. అనంతరం హాజరైన వారు వాల్మీకిమహర్షికి పూజలు నిర్వహించగా నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు. మధ్యాహ్నం వాల్మీకులంతా సమావేశమై ఐక్యతతోనే ఏమైనా సాధించగలమని తెలియజేశారు. సాయంత్రం గ్రామోత్సవంలో భాగంగా వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కార్యాలయం నుంచి పాతబస్టాండు, టిబిరోడ్డుమీదుగా నాలుగురోడ్లకూడలివరకు ఊరేగించారు. గ్రామోత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, నేతాజి, రాంపల్లె రామకృష్ణ, పడకండ్ల రవి, కె. శ్రీనివాసులు, బి.నరసింహుడు,మధు, శ్రీధర్,శీలం చిన్న ఓబులేసు సీసీ. మద్దిలేటి, తేజ, నాగేంద్ర, జి. రాఘవ, నాగరాజు, రాంపల్లి వెంకటేశ్వర్లు, సంఘ పెద్దలు రంగనాయకులు, నాగయ్యతదితరులు పాల్గొన్నారు.

## సాహితీ సేవకుడు కొప్పుల ప్రసాద్‌కి సత్కారం



**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 26 . (నంది పత్రిక ):** వాల్మీకి జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో, సాహిత్య రంగంలో నంద్యాల రచయిత కొప్పుల ప్రసాద్ చేస్తున్న సేవలకు గుర్తింపుగా "మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ" వారు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమానికి మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాజగోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "కొప్పుల ప్రసాద్ తెలుగు సాహిత్యానికి, భాషా వికాసానికి నిరంతరం కృషి చేస్తున్నారు. రోజుకు ఒకటి, రెండు రచనలు చేస్తూ సాహితీ ప్రియులకు అందిస్తున్నారు. ఆయన కలం నిత్యం అక్షర సేద్యం చేస్తూనే ఉంటుంది. మా సంస్థ ద్వారా ఆయనను సన్మానించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, పలువురు కళాకారులు, సినీ దర్శకులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు. సత్కారం పొందిన రచయిత కొప్పుల ప్రసాద్‌ను న్యూక్లియస్ కళాశాలల యాజమాన్యం శ్రీ మురళీధర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, తెలుగు పండితులు అన్నెం శ్రీనివాస రెడ్డి, కవి నరేంద్ర, నీలం వేంకటేశ్వర్లు, కళారాధన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ, ప్రముఖ న్యాయవాది రామచంద్రరావు, అంతర్జాతీయ శాస్త్రవేత్త రవీంద్రనాథ్‌లతో పాటు పలువురు కవులు, నంద్యాల పట్టణ ప్రముఖులు, సాహితీవేత్తలు మరియు మిత్రులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## సీఎం చంద్రబాబునైజం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే. మాజీ మంత్రి బుగ్గన తనయుడు అర్జున్ రెడ్డి.



**బేతంచెర్ల అక్టోబర్ 26 ( నంది పత్రిక ).** సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలను నిరంతరం మోసం చేయడమే ఆయన నైజం అని ఎపి.ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి తనయుడు వైఎస్ఆర్సిపి యువ నాయకుడు బుగ్గన అర్జున్ రెడ్డి విమర్శించారు. సోమవారం బేతంచెర్ల పట్టణంలోని వైసీపీ అభ్యర్థులు 8 వవార్డు అభ్యర్థి దూదేకుల ఇమామ్ హుస్సేన్ (మాచీ),9 వ వార్డు అభ్యర్థి పోలా మహేంద్ర రెడ్డి,10 వ వార్డు అభ్యర్థి పాపసాని తిరుమలేష్ రెడ్డి,11వ వార్డు అభ్యర్థి పింజరి కమల్ సాహెబ్,బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ అభ్యర్థి దూదేకుల దస్తగిరికి మద్దతుగా బుగ్గన అర్జున్ రెడ్డి ఇంటింటికీ తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించి, ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, వైసిపి నాయకులు బుగ్గన చంద్రశేఖర్ రెడ్డి,బుగ్గన లోహిత్ రెడ్డి,జస్వంత్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, మనోహర్,నజీరు, రియాజ్, ఇలియాజ్, మహేంద్ర, సురేష్, రవి, ౦౦౦ కాజా, జబ్బుల్లా, సామ్రాట్ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి జయంతి



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని కొతపల్లి గ్రామం వాల్మీకి కాలనీలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పురోహితులు లక్ష్మీ నరసయ్య శర్మ ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు శారు. మహిళలు, యువతులు, యువకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కాయ కర్పూరం సమర్పించి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం వేల అన్న ప్రసాదాలు. అన్నదాన కార్యక్రమాలు చేశారు. అదేవిధంగా సాయంకాలం సమయంలో వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని గ్రామ పుర వీధుల వెంట ఊరేంపు కార్యక్రమం కన్నుల పండుగగా జరిపించారు.

## పోస్టల్ బ్యాలెట్ ను సద్వినియోగం చేసుకోండి.

**కమిషనర్ ఎం. జయకృష్ణ.**



**తిరుపతి బ్యూరో చీఫ్ అక్టోబర్ 26 నంది పత్రిక** మునిసిపల్ సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొనే అర్హులైన అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరంలో ఓటు కలిగి ఉండి వేరే ప్రాంతాల్లో ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ నందు విధుల నిర్వహణ కాపీ, ఆధార్ అందించి,పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తును పూర్తి చేసి ఇవ్వాలని తెలిపారు.

## తగ్గేదే లేదు... 52 వార్డులకు 52 వార్డులు పోటీ చేస్తున్నాం... నంద్యాలలో వైసీపీ జెండా ఎగరవేస్తున్నాం

**విస్తృతంగా ఎన్నికల ప్రచారం...కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనపై నంద్యాలలో 'శిల్పా రవి రెడ్డి సమరభేరి.**



**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 26 (నంది పత్రిక )** ఎన్నికల ప్రచారంలో భాగంగా నంద్యాల పట్టణంలోని 7,8,10,11 వార్డులలో వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులైన చిల్లు భాయ్ ఏజాజ్ హుస్సేన్, షేక్ అబ్దుల్ మజీద్, దండే సుధాకర్, షేక్ అబ్దుల్ కలాం బాషా, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అమీర్ బాష (దాల్మిల్ అమీర్)తో కలిసి శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా విస్తృత ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. వైసీపీ అభ్యర్థుల కోసం వార్డులో ఉన్న సీనియర్ వైసీపీ నాయకులందరూ కలిసి గట్టుగా అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తున్న వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.. ఎన్నికల ప్రచారంలో ...మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, హామీల ఉల్లంఘనలను ఎండగట్టారు. మున్సిపాలిటీలో 52 వార్డులకు 52 పోటీ చేస్తున్నామని నంద్యాలలో వైసిపి జెండా ఎగరవేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు శిల్పా రవి రెడ్డి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేద ప్రజలను, మహిళలను నిలువునా మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తామని చెప్పి మాట తప్పిన కూటమి నాయకులు, అబద్ధాల కరపత్రాలతో ప్రజలను మళ్లీ మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. "ఎన్నికలు రాగానే కూటమి నాయకులకు మళ్లీ జనం గుర్తుకోస్తారని , నంద్యాలలో 25 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేశామంటూ విచ్చలవిడిగా కరపత్రాలు ముద్రించి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన 2 సెంట్ల స్థలం హామీ ఏమైంది? పేదల నడ్డి విరిచి గద్దెనెక్కిన ఈ ప్రభుత్వానికి ఓటుతోనే ప్రజలు బుద్ధి చెప్పాలని

**శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు నిచ్చారు"** ఎన్నికల సమయంలో నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చారని శిల్పా రవి మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను గాలికి వదిలేసి ప్రజలపై తీవ్ర భారం మోపారని ఆరోపించారు. పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తామని నమ్మించి మహిళలను దారుణంగా మోసం చేశారని శిల్పా రవిరెడ్డి విమర్శించారు. "నీకు 15.. నీకు 15.. నీకు 15": మహిళలకు రూ. 15 వేల నగదు పథకం అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 50 ఏళ్ల లోపు మహిళలకు ఏడాదికి రూ. 18 వేలు ఇస్తామన్న ప్రకటనలు ఏమయ్యాయని నిలదీశారు.లి గత మూడేళ్లుగా 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేస్తామని కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న కూటమి అభ్యర్థులను ఓటు అనే ఆయుధంతో ఓడించి ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే నంద్యాల పట్టణ రూపురేఖలు మారాయని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలో 8 నూతన పార్కుల నిర్మాణం, అర్బన్ హెల్త్ సెంటర్లు, మిల్క్ సెంటర్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశామని తెలిపారు. దశాబ్దాలుగా నంద్యాల ప్రజలను వేధిస్తున్న తాగునీటి సమస్యను 'అమృత్' పథకం ద్వారా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. అభివృద్ధికి పట్టంకట్టిన వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి, ప్రజా వ్యతిరేక కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ)ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి..!

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి**

**ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ తటస్థత పాటించాలి**

**ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు**

**కడప, బ్యూరో చీఫ్ అక్టోబరు 26 నంది పత్రిక** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి అమల్లోకి వచ్చే ప్రవర్తనా నియమావళి నిబంధనలను ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, సామాజిక మాధ్యమాలు, ముద్రణ, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు గౌరవించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన వంటి కీలక దశలు కొనసాగుతున్న నేపథ్యంలో, తదుపరి ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా, ఎన్నికల ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు తదితర దశల్లోనూ ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని, ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో రాజకీయ తటస్థతను పాటించాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు ఎన్నికల సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

**రాజకీయ కార్యకలాపాలకు ప్రభుత్వ ఉద్యోగులు దూరంగా ఉండాలి...**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల సిబ్బంది రాజకీయంగా పూర్తి తటస్థతను పాటించాలి. ఏ రాజకీయ పార్టీకి లేదా అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేయడం, ఓట్లు అభ్యర్థించడం, రాజకీయ సమావేశాలు, ర్యాలీల్లో పాల్గొనడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రచారం చేసే పోస్టులు పెట్టడం, వాటిని పంచుకోవడం, ఇష్టపడినట్లు గుర్తించడం, వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలు చేపట్టకూడదు.

**ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు...**

ప్రభుత్వ వాహనాలు, నిధులు, కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ అతిథి గృహాలు, ఇతర ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు. ప్రభుత్వ నిధులతో అధికార పార్టీ విజయాలు, పథకాలను ప్రచారం చేసే ప్రకటనలు జారీ చేయకూడదు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కొత్త ఆర్థిక ప్రయోజనాలు ప్రకటించడం, కొత్త పథకాలు ప్రారంభించడం, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిర్వహణకు ప్రభుత్వ అధికారులు సహకరించరాదు.

**అధికారిక పర్యటనల్లో ఎన్నికల ప్రచారానికి తావివ్వరాదు...**

మంత్రులు, ఇతర రాజకీయ నాయకులు అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారంతో ముడిపెట్టినప్పుడు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వారికి సహకరించరాదు. ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారుల బదిలీల విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలి. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన అనుమతులు పొందిన తరువాతే చర్యలు చేపట్టాలి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని సూచించారు.

**నగదు, విలువైన వస్తువుల తరలింపులో నిబంధనలు పాటించాలి...**

ఎన్నికల సమయంలో నగదు, బంగారం, వెండి, బహుమతి వస్తువులు తదితరాలను అనుమానాస్పదంగా లేదా నిబంధనలకు విరుద్ధంగా తరలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్ణీత పరిమితులకు మించి నగదు లేదా విలువైన వస్తువులను తీసుకెళ్లాల్సిన సందర్భాల్లో సంబంధిత ఆధారాలు వెంట ఉంచుకోవాలి. ఎన్నికల నిఘా బృందాలు తనిఖీలు నిర్వహించినప్పుడు అవసరమైన వివరాలు, పత్రాలను అందించి సహకరించాలి.

**పోలింగ్ కేంద్రాల్లో నిష్పాక్షికంగా వ్యవహరించాలి...**

పోలింగ్ రోజున ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడకూడదు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను అమలు చేయాలి. పోలింగ్ ఏజెంట్ల గుర్తింపు స్లిప్పులు తెల్ల కాగితంపై మాత్రమే ఉండేలా, వాటిపై రాజకీయ పార్టీ గుర్తులు లేదా అభ్యర్థుల పేర్లు లేకుండా చూడాలి. ఎన్నికల విధుల్లో ఉన్న ఉన్నతాధికారులు, తనిఖీ బృందాలకు పూర్తి సహకారం అందించాలి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు...**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, రాజకీయ పక్షపాతంతో వ్యవహరించినా సంబంధిత నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు చేపట్టే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పాక్షికంగా జరిగేందుకు ప్రజలు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని మాధ్యమాల ప్రతినిధులు ఎన్నికల సంఘానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.



# రైతునగరంలో కదం తొక్కిన సూర్య రాధమధు దంపతులు

**ప్రజల్లోకి సూర్య రాధమధు**

**నంద్యాల మున్సిపాలిటీ ప్రజలు దీవిస్తే సుపరిపాలన అందిస్తాం**

**-మున్సిపల్ ఛైర్ పర్సన్ అభ్యర్థి పట్నంశెట్టి రాధ, కౌన్సిలర్ అభ్యర్థి సూర్య మధు**

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 26 ( నంది పత్రిక )** మున్సిపల్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా ప్రజా క్షేత్రంలోకి సూర్య రాధ మధు దంపతులు ప్రయాణం మొదలుపెట్టారు. మున్సిపల్ ఎన్నికల అధికారులు స్వతంత్ర అభ్యర్థులైన సూర్య రాధమధు దంపతులకు గుర్తులకు కేటాయించారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ అభ్యర్థి అయిన పట్నంశెట్టి రాధకు కుండ గుర్తును కేటాయించారు. రైతునగరం 28వ వార్డు స్వతంత్ర అభ్యర్థి పిఎం. లక్ష్మి నరసింహంకు కత్తెర గుర్తును కేటాయించారు. ఆదివారం ఎన్నికల అధికారులు గుర్తును కేటాయించడంతో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. రైతునగరం వార్డులో సూర మధు నివాసం ఉంటున్న జర్నలిస్టు కాలనీ నుంచి ఎన్నికల ప్రచారానికి స్వీకారం చుట్టారు. సకుటుంబ సమేతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సూర్య మధుకు మద్దత్తుగా ఆయనకు అత్యంత సన్నిహితులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు ప్రచారంలో ఆయన వెంట నడిచారు. సూర్య రాధమధు దంపతులు ఓటర్లను అప్యాయంగా పలకరిస్తూ ఎన్నికల్లో ఓట్లు వేసి బలపర్చాలని కోరారు. ఎన్నిక ప్రచారాన్ని ప్రారంభిస్తూ తనని కలిసి విలేకరులతో సూర్య మధు మాట్లాడుతూ సామాన్య కుటుంబం ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చామన్నారు. 30సంవత్సరాలకు పైగా పాత్రికేయుల వృత్తిలో పని చేసిన తనకు నంద్యాలలోని ప్రముఖులతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని వెల్లడించిన రోజు నుంచి పలువురు ప్రముఖులు ఫోన్లో సంప్రదించి ప్రత్యేకంగా అభినందించారని గుర్తు చేశారు. మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న మాకు స్నేహితులు, శ్రేయోభిలాషులు, అభిమానులు మద్దత్తుగా నిలిచారన్నారు. ప్రజలకు అవకాశం కల్పిస్తే నంద్యాల మున్సిపాలిటీతో పాటు రైతునగరం వార్డు అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం సహకారంతో ప్రజాప్రతినిధులతో కలిసి నంద్యాల మున్సిపాలిటీలో సుపరిపాలన అందించాలని భావిస్తున్నామన్నారు. రైతునగరం వార్డు పరిధిలోని జర్నలిస్టు కాలనీతోపాటు బృందావనం కాలనీలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంట్లో ఓటర్లను కలిశారు. మధు సతీమణితోపాటు కోడళ్లు ప్రతి మహిళకు బొట్టుపెట్టి ఎన్నికల్లో మద్దత్తు ఇవ్వాలని అభ్యర్థించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఛైర్ పర్సన్ అభ్యర్థి పట్నంశెట్టి రాధకు కుండ గుర్తుకు, 28వ వార్డు రైతునగరం అభ్యర్థి పిఎం. లక్ష్మినరసింహంకు కత్తెర గుర్తుకు ఓటు వేయాలని కోరారు.



# డబుల్ గేమ్ ఆడేవారికి ఓటు వేయొద్దు.





## అధికార పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తే అభివృద్ధి జరుగుతుంది. వైసిపి కి ఓటు వేస్తే దండగ.

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 26 ( నంది పత్రిక )** రాజకీయాల్లో డబుల్ గేమ్ ఆడేవారికి ఓటు వేయవద్దని,అధికార పార్టీ అభ్యర్థులకు ఓటు వేస్తే అభివృద్ధి జరుగుతుందని,వైసిపి కి ఓటు వేస్తే దండగ అని మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ ఏవీ సుబ్బారెడ్డి,టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి.ఫిరోజ్ పేర్కొన్నారు.స్థానిక 35 వార్డ్ అభ్యర్థి బాబు లాల్ కు మద్దతుగా మున్సిపల్ చైర్మెన్ అభ్యర్థి డాక్టర్ బాబన్,ఏవీ సుబ్బారెడ్డి,ఫిరోజ్ లు ఆ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.వార్డులో ప్రజలు ఘన స్వాగతం పలికారు.మహిళలు హారతులు ,పూలవర్షం కురిపించారు.ఇంటింటికి వెళ్లి టీడీపీ చేసిన అభివృద్ధి,సంక్షేమ ఫలితాలు వివరించారు.అనంతరం మీడియా తో మాట్లాడుతూ వార్డులో కొందరు డబుల్ గేమ్ ఆడేవారికి ఓటు వేయవద్దని సూచించారు.అధికార పార్టీ అభ్యర్థులకు ఓటు వేస్తేనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు.వైసిపి పార్టీ నాయకులు రోజుకో మాయమాటలు చెపుతున్నారని అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరి ఖాతాల్లో డబ్బులు వేస్తే వైసిపి నాయకులు ఎగతాళి మాటలు మాట్లాడుతున్నారన్నారు.తల్లికి వందనం,ఫ్రీ బస్ తో ప్రజలు ఆనందంగా ఉంటే జీర్ణించుకోలేకపోతున్నారు అన్నారు.ప్రజలు వైసిపి అభ్యర్థులను గెలిపిస్తే ఏ పని చేయరని,మా పార్టీ అధికారంలోకి వస్తె చేస్తామని చెపుతారని అన్నారు.వైసిపి అభ్యర్థులకు ఓటు వేస్తే దండగ అని గుర్తించాలని అన్నారు.చైర్మెన్ అభ్యర్థి డాక్టర్ బాబన్,కౌన్సిలర్ అభ్యర్థి బాబు లాల్ కు అత్యధిక మెజారిటీ సాధించాలన్నారు.బాబు లాల్ పనిచేయకపోతే మా దృష్టికి తీసుకొస్తే ఆయన భారతం పెడతామన్నారు.కౌన్సిలర్ అభ్యర్థి బాబు లాల్ మాట్లాడుతూ ఈ వార్డు అభివృద్ధి చెందింది అంటే టీడీపీ హయంలోనే అభివృద్ధి జరిగిందన్నారు.గత పాలకులు ఈ వార్డ్ అభివృద్ధికి కోట్లారుపయలతో అభివృద్ధి చేసిన విషయం గుర్తుచేశారు.ప్రధానంగా ఈ వార్డులో పేదలు అధికంగా జీవిస్తున్నారని పలు సమస్యలు నా దృష్టికి తీసుకొచ్చారు అన్నారు.గతంలో ఓట్లు వేసి గెలిపించుకున్న నాయకుడు మాదిరి కమీషన్లకు కక్కుర్తిపడేవాడిని కాదన్నారు.ఎన్నికలు వస్తె డబ్బులు దందా చేసే రకం కాదన్నారు. అక్రమాలు,దౌర్జన్యాలు చేస్తే ప్రజలు ఆశీర్వాదాలు ఉండవని అన్నారు.ప్రజల ప్రేమ సాధిస్తే విజయం తధ్యం అన్నారు.మంచిగా ఉంటే మంచిగా ఉంటా,భయపడే పరిస్థితింకేదని చెప్పకనే చెప్పారు.మీ కుటుంబసభ్యుడిగా భావించి మీ అమూల్యమైన ఓటు చైర్మెన్,కౌన్సిలర్ అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది,అభివృద్ధి చేయదని వీలవుతుందని అన్నారు.గతంలో గెలిచిన అభ్యర్థి ఈ వార్డు కు నిధులు తెచ్చుకోవడంలో విఫలం అయ్యారని అన్నారు.మున్సిపల్ చైర్మెన్ ఎస్ పార్టీ వారు ఉన్నా నిధులు మంజూరు చేయడం లేదని కౌన్సిల్ లో జరిగిన విషయాలు అందరికీ తెలుసన్నారు.టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.

ఈ ప్రచారంలో భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎంతోనే పోరాటం





## 18వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించిన సీపీఎం నాయకులు

**డోన్ నంది పత్రిక అక్టోబర్ 26** డోన్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సోమవారం పట్టణంలోని చిగురుమానిపేట 18వ వార్డులో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగరాజు, పట్టణ కార్యదర్శి, మండల కార్యదర్శి నక్కి శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొని ప్రజలను కలిసి పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, మహిళలు, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. డోన్ మున్సిపల్ ఎన్నికల్లో 15వ వార్డు అభ్యర్థిగా అబ్దుల్ రహిమాన్, 18వ వార్డు అభ్యర్థిగా నక్కి లావణ్య, 25వ వార్డు అభ్యర్థిగా షమీమ్ బేగం పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. డోన్ పట్టణంలో ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఎం నాయకులు విమర్శించారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం, సీసీ రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువల ఏర్పాటు, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్ల సౌకర్యం కోసం తమ పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు.సొంత ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని, అర్హులైన పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని సీపీఎం నిరంతరం పోరాడుతోందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సిల్‌లో ప్రజల తరపున గొంతు వినిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.డోన్ పట్టణ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న కర్నూలు, నంద్యాల రైల్వే గేట్ల సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను నివారించాలని, ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని, విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలపై సీపీఎం పార్టీ నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తోందని వివరించారు.దేశంలో మైనార్టీలు, దళితులు, గిరిజనులు, క్రైస్తవ మైనార్టీలు, ప్రశ్నించే గొంతుకలపై దాడులు జరుగుతున్నాయని సీపీఎం నాయకులు ఆరోపించారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం తమ పార్టీ పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. రాష్ట్రంలోని టీడీపీ కూటమి, వైఎస్సార్‌సీపీలు ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని వారు విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఆయా పార్టీలు అనుసరిస్తున్న వైఖరిని ప్రశ్నిస్తూ, ప్రజల సమస్యలు, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులకు మద్దతు తెలిపి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు మాధవి, సిరిన, సూర్య, పద్మావతి, నీలావతమ్మ, లక్ష్మీదేవి, అమృతారెడ్డితో పాటు సీపీఎం నాయకులు రామాంజనేయులు, శివరాం, నాగమద్దయ్య, నక్కి హరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో శాస్త్రీయ విప్లవానికి హరిత ఫౌండేషన్ శ్రీకారం - బండి పరిమళ జ్యోతి

**కాశినాయన, అక్టోబర్ 26 (నంది పత్రిక ):**విద్యా ప్రదాత ,మార్గదర్శి , దార్శనికుడు ముఖ్యవక్త ,ప్రముఖ సంఘ సేవకులు అమెరికాలో నివాసం ఉంటున్న డాక్టర్ ఫణి రాజకుమార్ స్థాపించిన హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో హరిత ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి గ్రామీణ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించాలని లక్ష్యంతో యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం- రోబోటిక్స్ కార్యక్రమంను కాసినాయన మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సాపురంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆమ్నిస్టిక్స్ లాబ్స్- సీఈవో ఉదయ్ చైతన్య విద్యార్థులకు రోబోటిక్స్ కి సంబంధించిన అంశాలను వివరించి, రోబోట్ల సహాయంతో విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొంటూ రోబోటిక్స్ పనితీరును తెలుసుకున్నారు. ఈ విధమైన ప్రయోగాత్మక అభ్యసనం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, తార్కిక ఆలోచన, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు పెంపొందుతాయని వివరించారు. ఎలక్ట్రానిక్ కంటెంట్, ఆధునిక బోధనా పద్ధతు ల సహాయంతో విద్యార్థు లు సులభంగా ,ఆసక్తికరంగా నేర్చుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. సైన్సును కేవలం పుస్తకాల ద్వారా కాకుండా, ప్రత్యక్ష అనుభవాల ద్వారా నేర్చుకోవడానికి ఈ కార్యక్రమం దోహద పడింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకొని వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు ప్రకృతిని కాపాడుకోవడం కూడా ప్రతి విద్యార్థి బాధ్యత అనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కాశి నాయన మండలం విద్యాశాఖ అధికారులు మహమ్మద్ షఫీ, నిర్మల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం సుబ్బారెడ్డి , ఉపాధ్యాయులు కృషి చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉందని హరిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పనిరాజకుమార్ గారికి, హరిత ఫౌండేషన్ బృందానికి ఉపాధ్యాయులు, ఎంఈఓ లు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



# రహ్మాన్‌పురంలో 5 లీటర్ల నాటుసారా స్వాధీనం



**డోన్ నంది పత్రిక అక్టోబర్ 26**నాటుసారా తయారీ, విక్రయాల నియంత్రణకు విస్తృతంగా దాడులుబేతంచర్ల మండలంలోని రహ్మాన్‌పురం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి ఓ మహిళ వద్ద 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, సదరు మహిళను డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎం.డి. జఫ్రుల్లా ఆధ్వర్యంలో బేతంచర్ల మండలంలోని బుగ్గనపల్లి తండా గ్రామంలో నాటుసారా తయారీ, విక్రయాలపై విస్తృతంగా తనిఖీలు, దాడులు నిర్వహించారు. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి నాటుసారా పట్టుబడలేదు.అనంతరం రహ్మాన్‌పురం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, ఓ మహిళ వద్ద 5 లీటర్ల నాటుసారా లభించడంతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితురాలిని డోన్ కోర్టులో హాజరుపరిచారు. అదేవిధంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నలుగురు వ్యక్తులను డోన్ తహసీల్దార్ కార్యాలయంలో హాజరుపరిచారు.ఈ దాడుల్లో ఎస్సైలు పి. దౌలత్ ఖాన్, ఓ. సోమశేఖర్, ట్రైనీ ఎస్సైలు ఎ. వెంకటేశ్వర్లు, ఎం. అన్వేష్, హెడ్ కానిస్టేబుళ్లు సుధాకర్ రెడ్డి, శేషన్న, కానిస్టేబుళ్లు ఉమాకాంత్ రెడ్డి, శివపార్వతి పాల్గొన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలపై నిరంతరం నిఘా ఉంచి, అక్రమ కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



# ఇర్లపాడు సిగ్మెంట్లో వైసిపి జెడ్పిటిసి అభ్యర్థి ఎన్నికల ప్రచారం

### ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయమని ఇంటింటికి తిరిగి ప్రచారం.

### వైసిపి జెడ్పిటిసి అభ్యర్థి సిద్ధం రెడ్డి వెంకటరమణమ్మ

### ఇర్లపాడు సిగ్మెంట్ వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి దుగ్గిరెడ్డి మమత



**మర్రిపాడు అక్టోబర్ 26 నంది పత్రిక:** మర్రిపాడు మండల పరిధిలోని ఇర్లపాడు సిగ్మెంట్ లోని అల్లంపాడు, ఖాదర్ పూర్, సన్నవారిపల్లి గ్రామాలలో నెల్లూరు జిల్లా మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి ఆశీస్సులతో, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి బలపరిచిన మర్రిపాడు వైయస్సార్సీపి జడ్పిటిసి అభ్యర్థి సిద్ధం రెడ్డి వెంకటరమణమ్మ మరియు ఇర్లపాడు సిగ్మెంట్ వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి దుగ్గిరెడ్డి మమత ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి జెడ్పిటిసి అభ్యర్థి సిద్ధం రెడ్డి వెంకటరమణ మరియు ఇర్లపాడు సిగ్మెంట్ వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి దుగ్గిరెడ్డి మమత మాట్లాడుతూ మండల ప్రజానీకం తమ యొక్క అమూల్యమైన ఓటును ఫ్యాను గుర్తుకి వేసి ఎంపీటీసీ మరియు జెడ్పిటిసి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని.. ప్రజల ప్రేమే నా బలం మీ నమ్మకమే నా బాధ్యత మీ కష్టాల్లో తోడుగా ఉంటూ మీ గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడమే నాకు సంకల్పం అంటూ అమూల్యమైన ప్రజల యొక్క ఓట్లను వైఎస్ఆర్సిపి గుర్తు అయిన ఫ్యాన్ గుర్తుకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సిద్ధం రెడ్డి మోహన్ రెడ్డి, దుద్దుగుంట రవికుమార్ రెడ్డి,దుగ్గిరెడ్డి కృష్ణ ప్రసాద్ రెడ్డి, దుద్దుగుంట కృష్ణారెడ్డి, సంగన సుందరరామి రెడ్డి,సన్నపురెడ్డి చక్రవర్ధన్ రెడ్డి, బొ ర్రా సుబ్బిరెడ్డి, షేక్ మౌలాలి,చెవుల ప్రణవి శ్రీనివాస్,దుద్దుగుంట జయరామి రెడ్డి,బొర్రా ఓబుల్ రెడ్డి,కొండ్రెడ్డి రమణారెడ్డి, శేఖర్,గోగుల నాగరాజు,బొర్రా నారాయణరెడ్డి, కాలవ మల్లికార్జున రెడ్డి, నల్లమారు రామిరెడ్డి,బొర్రా విష్ణువర్ధన్ రెడ్డి, ,వైయస్ఆర్సీపీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు

## మహదేవపురం ఎంపీటీసీ గజ్జల పెద్ద మద్దిలేటి సమర్పించిన బీఫారం



**శిరివెళ్ల( నంది పత్రిక) :** సిరివెళ్ల మండల పరిధిలోని నల్లమల అడవి సమీపంలో గల మహదేవాపురం గ్రామ ఎంపీటీసీ అభ్యర్థి గజ్జల పెద్ద మద్దిలేటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తన బీఫాంలో స్థానిక ఎన్నికల అధికారులకు అందజేశారు. గజ్జల పెద్ద మద్దిలేటి వెంట మాజీ ఎంపీటీసీ మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నరహరి మరియు టిడిపి యువనేత కంపరాజు రాజేష్ గౌడ్ ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామ అభివృద్ధి కోసం గ్రామ ప్రజల సంక్షేమం కోసం ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో నిలిచామని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి గారు మాజీ ఎమ్మెల్యే గంగుల భీజేంద్ర రెడ్డి గారీ సహకారంతో ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారికి బీఫారం అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందాయని పేద బడుగు బలహీన వర్గాలకు ధరలు అందుబాటులో ఉండేవని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో అధిక ధరలతో సామాన్యులు విలవిలలాడుతున్నారని ధరల బాదుడిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో పేదలు ఆర్థిక ఇబ్బందులకు అధిక ధరల బా భారంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రభుత్వ పాలనను కూటమిపాలనను ఓటర్లు గమనించి వైసిపి అభ్యర్థిని ఓటు ద్వారా ఆశీర్వదించాలని కోరారు.

## సైకిల్ గుర్తుకు ఓటేయండి.. షేక్ సబియాకు మద్దతుగా ప్రచారం

### చిగురుమానిపేటలో కేశన్న గౌడ్ విస్తృత ప్రచారం



**డోన్ నంది పత్రిక అక్టోబర్ 26** డోన్ మున్సిపాలిటీ పరిధిలోని చిగురుమానిపేట 18వ వార్డు అభ్యర్థి షేక్ సబియా గెలుపును కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న అభ్యర్థికి మద్దతుగా కేశన్న గౌడ్ స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థిని గెలిపించాలని కోరారు.ప్రచారంలో భాగంగా నాయకులు వార్డులోని ప్రధాన వీధులు, కాలనీలు, నివాస ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆదరణతో అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. షేక్ సబియా ప్రజలతో సన్నిహితంగా ఉంటూ వారి అవసరాలను తెలుసుకుని సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మహిళలు, వృద్ధులు, యువత, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కార మార్గాలు చూపుతామని చెప్పారు. స్థానిక ప్రజలు ప్రచార బృందానికి పలుచోట్ల స్వాగతం పలికారు. అభ్యర్థి షేక్ సబియాకు తమ మద్దతు ఉంటుందని పలువురు ఓటర్లు తెలిపారు. వార్డు అభివృద్ధి కోసం సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని నాయకులు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి షేక్ సబియాను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. వార్డులో మౌలిక వసతుల మెరుగుదలతో పాటు పారిశుధ్య నిర్వహణ, ప్రజా సేవల అందుబాటు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కేశన్న గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జి లోకనాథ్ రావు, రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు వీరాంజనేయులు, హిమాంబాషా, నూర్ బాషా, చిన్న, జనసేన నాయకుడు మైకేల్, హిమాంసా తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు, స్థానిక నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.



# 38 వ వార్డులో తెలుగు దేశం అభ్యర్థి జెల్లిపల్లి దిలీప్ విస్తృత ప్రచారం

**30 సంవత్సరాల రాజకీయ జీవితం**

**వార్డులు తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు**

**ప్రతి నెల పింఛనుదారులకు తన సొంత ఖర్చులతో అల్పాహారం**

**వార్డులో ఉన్న ప్రతి సమస్యను తనదైన శైలిలో పరిష్కారం చేయగల సత్తా ఉన్న నాయకుడు**

**అధికారంలో ఉన్న లేకపోయినా నిత్యం ప్రజల సేవకుడిగా మంచి గుర్తింపు ఉన్న నాయకుడు**

**తన వార్డు ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుండి వారి సమస్యను పరిష్కరించే సత్తా గల నాయకుడు**

**ఇలాంటి వ్యక్తిని మళ్లీ కౌన్సిలర్ గా చూడాలని 38వ వార్డు ప్రజల ఆకాంక్ష**



**నంద్యాల అక్టోబర్ 26, నంది పత్రిక:** నంద్యాల పట్టణంలోని 38వ వార్డులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జల్లేపల్లి దిలీప్ విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ వారికి భరోసాను కలిగిస్తూ తనను ఎలక్షన్లలో ఓటు వేసి వేయించి గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు . వార్డులో గల ప్రతి సమస్యను తనదైన శైలిలో పరిష్కరించే సత్తా ఉన్న నాయకుడు జల్లేపల్లి దిలీప్. ప్రతినెల తన సొంత ఖర్చులతో పింఛనుదారులకు అల్పాహారం అందిస్తూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందుండి పరిష్కరించగల సత్తా గల నాయకుడు జల్లిపల్లి దిలీప్.

**ఎన్ ఎండి పార్క్ మంత్రి ఆశీస్సులతో జల్లిపల్లి దిలీప్ పట్టబోతున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలు**

1.ప్రతినెల వార్డు పింఛనుదారులకు ఒకటవ తేదీన నా సొంత ఖర్చులతో ఐదు సంవత్సరాలు ఉచిత అల్పాహారము అందించబడును.

2.దేవనగర్ వాల్మీకి గుడి దగ్గర నుండి పద్మావతి నగర్ కు బ్రిడ్జి నిర్మాణం చేయడానికి మంత్రి సహకారంతో నా వంతు కృషి చేస్తాను.

3.వేసవికాలంలో త్రాగునీటి సౌకర్యము నా సొంత టాంకర్లతో నీతి సరఫరా చేస్తాను.

4.వార్డు ప్రజలకు ప్రతి సంవత్సరానికి రెండుసార్లు ప్రముఖ డాక్టర్లతో ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తాను, ఉచిత రక్త పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇప్పించగలను.

5.38వ వార్డు ఇంటి పనులు మరియు పట్టాలు మార్పిడికి కృషి చేస్తాను.

6.38వ వార్డులో గవర్నమెంట్ ఇస్తున్న సంక్షేమ పథకాలన్నీ వార్డు ప్రజలకు సక్రమంగా అందరికీ అందజేస్తాను.

7.38వ వార్డు పార్కు నందు నూతన ఆరో ప్లాంట్ మంత్రి మరియు ఎంపీ సహకారంతో నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తాను.

8.38వ వార్డులో శానిటరీ పనులు క్రమం తప్పకుండా చేయిస్తాను... దేవ నగర్ అనగానే మొదట గుర్తు వచ్చే వ్యక్తి పేరు దిలీప్. 38వ వార్డులో ప్రజలందరికీ మంచి సేవ చేస్తూ అధికారంలో ఉన్నా లేకపోయినా వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తూ తన 30 ఏళ్ల ప్రజా సేవకుడిగా మంచి గుర్తింపు ఉన్న నాయకుడు. ఇలాంటి వ్యక్తి మళ్లీ కౌన్సిలర్ గా నిలబడడం 38వ వార్డు ప్రజల అదృష్టమని పట్టణ ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇంతటి ప్రజా సేవకుడు కి మా విలువైన ఓటును వేసి వేయించి గెలిపించుకోవాలని 38 వార్డు ప్రజలు చర్చించుకుంటున్నారు..



# ఎన్నికలకు సిద్ధమంటూ సంకేతాలు!



**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 26:** వివిధ పార్టీలకు సంబంధించిన నామినేషన్ల ఉప సంహరణ ఒకరోజు గడువు ఉండగానే ఎన్నికలకు పార్టీలు సిద్ధమవుతున్నాయని సంకేతాలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల నుండి చర్చలు... మాకు ఎన్ని.. మీకు ఎన్ని..అంటూ వెలువడుతున్న ఊహాగానాలకు తెరపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బండి ఆత్మకూరు మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, అన్ని స్థానాలకు అధికార తెలుగుదేశం పార్టీతోపాటు, వైయస్సార్ పార్టీ, సిపిఎం, సిపిఐ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని పార్టీల నాయకులు మొదట్లో ఉత్సాహం చూపినప్పటికీ, ఈ విషయంలో చర్చలు జరుగుతున్నాయి, ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకునే ప్రయత్నాలు కూడా పెద్ద నాయకులు చేస్తున్నారన్న సంకేతాలతో, రెండు పార్టీలకు చెందిన అభ్యర్థులు మౌనంగా ఉన్నారు. ఈ విషయంపై సోమవారం నాడు జరిగిన చర్చలు విఫలం కావడంతో, ఇక పోటీకి సిద్ధమని సంకేతాలు వెలువడ్డాయి. ఉపసంహరణకు ఒక రోజు గడువు ఉండగానే వైఎస్ఆర్ పార్టీకి చెందిన ఎంపీటీసీ అభ్యర్థులందరూ బీఫారంలను ఎన్నికల అధికారులకు సమర్పించడంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతూ ఉంది. మరికొందరు అభ్యర్థులు బీఫారములను సిద్ధం చేసుకుని మంగళవారం నాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో భాగంగా, మండలంలో బి.కోడూరు గ్రామానికి జనసేన అభ్యర్థిని, కడమల కాల్వ గ్రామానికి ఎంపిటిసి అభ్యర్థిగా బిజెపి పార్టీకి చెందిన వారిని కూటమి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ నిర్ణయాన్ని అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు జీర్ణించిపోలేకపోయారు. బి.కోడూరు గ్రామంలో ఎంపీటీసీ అభ్యర్థి జనసేన పార్టీకి కేటాయించిన నేపథ్యంలో, మొదట్లో ఆ గ్రామంలో అధికార పార్టీ నాయకుల నుండి నిరసనల సెగ జనసేన పార్టీ అభ్యర్థికి తగిలింది. జనసేన పార్టీ అభ్యర్థి ఎన్నికల్లో పోటీ చేస్తే, మద్దతు తెలుపకుండా శల్య సారథ్యం వహించే కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

**ఓటర్లలో సంబరం** ఇన్నాళ్లు ఎన్నికలు ఏకగ్రీవం చేసుకుంటున్నారు అన్న వార్తలతో నిరుత్సాహానికి గురైన ఓటర్లు, ప్రస్తుతం ఎన్నికలు జరుగుతాయని సంకేతాలు వస్తూ ఉండటంతో సంబర పడుతున్నారు. ఏకగ్రీవాల కారణంగా తాము ఓటు వేసే హక్కును కోల్పోతున్నామని, ఈ కారణంగా రాజ్యాంగం ప్రసాదించిన, భవిష్యత్తును ప్రశ్నించే హక్కును కూడా కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన పడ్డారు. ప్రస్తుతం ఎన్నికలు జరిగితే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అడ్డంకులు ఉండవని ఓటర్లు అభిప్రాయపడుతున్నారు.



# ఎన్నికల బాత కహాని

నారప్పకు నాలుగు రోజుల నుండి మందు లేక నాలుక పిడచ కట్టుకొని పోతావుంది.ఎంపిటిసి ,జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్లు వేసి నాలుగు రోజులవుతుంది. ఏ నాయకుడు చుక్క మందు పోయడం లేదు. అధికార అభ్యర్థి గాని, ప్రతిపక్ష అభ్యర్థిగాని పలకరించే దిక్కు లేకుండా పోతా ఉంది. ఏం చేయాలబ్బా! అంటూ నారప్ప బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడు. జెడ్పిటిసి స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికలలో నామినేషన్ వేసిన వెంకటప్ప గుర్తుకు వచ్చాడు. అక్కడికైనా వెళితే కాస్త మందు అయినా దొరుకుతుంది అన్న ఆశతో అక్కడికి వెళ్ళాడు. అప్పటికే వెంకటప్ప సీసా పెట్టుకుని ఎన్నికల ఊహల్లో ఊరేగుతూ మందు తాగుతూ కూర్చున్నాడు. వెంకటప్ప మందు తాగుతున్న విషయాన్ని చూసి, నారప్ప నోట్లో ఒల్య బట్ట నోట్లో నములుకుంటూ వెంకటప్ప వైపు ఆశగా చూస్తూ నిలుచున్నాడు. ఇది గమనించిన వెంకటప్ప , ఏంట్రా.. బయట ఏమి ఉండావు.. లోపలికి రా అంటూ నారప్పని పిలిచాడు. అప్పటికే మందు లేక తణుకులాడుతున్న నారప్ప వెంటనే వెంకటప్ప కాళ్ల దగ్గర కూ లబడ్డాడు.

**వెంకటప్ప:** ఏంట్రా సంగతులు.. ఊర్లో ఏమనుకుంటున్నారు?

**నారప్ప:** అంతా నీ గురించే అనుకుంటున్నారయ్యా ..

నామినేషన్ వేశారంట కదా! మీరే గెలుస్తారని ఊర్లో అంతా అనుకుంటా ఉండారు.

**వెంకటప్ప:** ఏంటి రోయ్! కాక పడుతున్నావా .. ఆ...

**నారప్ప:** అదేమీ లేదయ్యా! అధికారం, ప్రతిపక్ష సభ్యులకు ఎన్నికలలో ఖర్చు పెట్టడానికి డబ్బు లేదని, ఎరువుల దుకాణం మీకు ఉంది కాబట్టి గ్రామాలలో కాస్త కూస్తో పలుకుబడి మీకే ఉందని ఊర్లో అంతా అనుకుంటా ఉండారు.

**వెంకటప్ప:** ఎన్నినో పరిస్థితి వల్ల వ్యాపారం అంతంత మాత్రమే ఉంది. ఆర్థిక పరిస్థితి కూడా బాగాలేదు, ఏదో కొండకు వెంట్రుక వేసినట్టు, నామినేషన్ వేసాం.., ఎవడో ఒకడు రాజీకి కానీ రాకపోతాడా! ఖర్చులకు ఇవ్వకపోతారా!అనుకుంటా ఉంటే, వీడేంటి? అంతా నా గురించి అనుకుంటూ ఉండారు అంటూ వెంకటప్ప మనసులోనే గొణుక్కుంటున్నాడు.



ఇంతలోనే ఎరువుల అంగడి గుమస్తా నుండి వెంకటప్ప కు ఫోన్ వచ్చింది. అయ్యా! షాపు వద్దకు పోలీసులు, విజిలెన్స్ అధికారులు దాడికి వచ్చారు, అంటూ కబురందించాడు. దీంతో వెంకటప్ప కు తాగినదంతా దిగిపోయింది. ఇదంతా అధికార పక్షం వాళ్లు చేయించారని వెంకటప్ప గుర్తించాడు. ఎన్నికల బరి నుండి తనను తప్పించేందుకు వాళ్లే పోలీసులను రప్పించి ఉంటారని ఊహించాడు. ఎందుకొచ్చిన గొడవ.. నామినేషన్ విత్ డ్రా చేసుకోవాలని వెంకటప్ప ఎరువుల దుకాణం వద్దకు వెళ్లే పనిలో పడ్డాడు.

**నారప్ప:** ఇంతసేపు యవ్వారం చేస్తున్యా , చుక్క మందు కూడా పోయడం లేదు ఏమిటి? అంటూ నీళ్లు నములుకుంటూనే, అయ్యా! కాస్త మందు అంటూ నసిగాడు.

**వెంకటప్ప:** తూ నీ యవ్వ! పోలీసోళ్ళు షాపు దగ్గరికి వచ్చి నన్ను రమ్మంటుంటే.. మందంటూ నీ గొడవ ఏమిట్రా? మందు లేదు ,నీ బొంద లేదు.. వెళ్ళు ఇక్కడి నుంచి అంటూ హుంకరించాడు. ఖర్చుల మాట దేవుడు ఎరుగు.. నామినేషన్ విత్ డ్రా చేసుకుంటే, కాస్త వ్యాపారమైన చేసుకోవచ్చు! విత్ డ్రా చేసుకుంటేనే బాగుంటుందన్న ఉద్దేశంతో షాపు వైపు పరిగెత్తాడు. ఇంతసేపు యవ్వారం చేసినా, ఓ సీసా నా మొహాన పడేయలేదు అంటూ, నారప్ప గొణుక్కుంటూ ఇంటిదారి పట్టాడు.

**గమనిక** పాఠకులు చదువుకోవడానికి సరదాగా అల్లిన కట్టుకథ

**రసూల్నంది పత్రిక జర్నలిస్టు**
**బండి ఆత్మకూరు**

# రెండేళ్ల వయసులోనే రికార్డు.. తబలాతో అద్భుతం చేసిన చిన్నారి.. వీడియో వైరల్

కర్ణాటకకు చెందిన ఓ చిన్నారి అరుదైన ఘనత సాధించింది. కేవలం రెండు సంవత్సరాల పది నెలల వయసులోనే తబలా వాయించి 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకుంది. అత్యంత పిన్న వయస్కురాలైన తబలా కళాకారిణిగా రికార్డు సృష్టించి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

వివరాల్లోకి వెళితే, కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా, హొన్నవర ప్రాంతానికి చెందిన స్వరశ్రీ హెగ్డే ఈ అద్భుతాన్ని చేసింది. ఈ చిన్నారి 12 రకాల తాళాలను వాటి స్వర శైలి సహా ఎలాంటి తప్పులు లేకుండా పఠిస్తూ, వాయించి ఈ రికార్డును సొంతం చేసుకుంది. స్వరశ్రీ తండ్రి గురురాజ్ హెగ్డే ఒక ప్రముఖ తబలా విద్వాంసుడు కాగా, తల్లి శ్రీలత హిందుస్తానీ గాయని, ఇంగ్లిష్ ప్రొఫెసర్. తమ కుమార్తె ఏడాది వయసు నుంచే తబలాపై ఆసక్తి చూపిందని, దానిపైనే నిద్రపోయేదని తల్లిదండ్రులు తెలిపారు. ఆమె ఆసక్తిని గమనించి, తండ్రి తన ఇతర విద్యార్థులకు పాఠాలు చెబుతున్నప్పుడు స్వరశ్రీని పక్కనే కూర్చోబెట్టుకుని శిక్షణ ఇచ్చారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సేవల కోసం డోన్ సిబ్బంది పయనం

**తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సేవల కోసం డోన్ విద్యుత్ ఉద్యోగులు పయనం**

**కాకినాడకు 30 మంది విద్యుత్ సిబ్బంది తరలింపు**



**డోన్ నంది పత్రిక, అక్టోబర్ 26** తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సేవలకు అంతరాయం కలగకుండా, అవసరమైన మరమ్మతు పనులను వేగంగా చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కాకినాడ ప్రాంతంలో విద్యుత్ సేవలను పునరుద్ధరించేందుకు డోన్ విద్యుత్ డివిజన్ నుంచి సుమారు 30 మంది సిబ్బంది సోమవారం బయలుదేరి వెళ్లారు.డోన్ సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు), లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు (జేఎల్ఎంలు) కలిపి మొత్తం 30 మంది సిబ్బందిని కాకినాడ ప్రాంతానికి పంపించారు. తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి, మరమ్మతు పనులు చేపట్టేందుకు వీలుగా ఈ సిబ్బందిని ప్రత్యేకంగా పంపించినట్లు తెలిపారు.డోన్ డివిజన్ అధికారి కమలాకర్ విద్యుత్ సిబ్బంది ప్రయాణిస్తున్న వాహనానికి పచ్చజెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు విద్యుత్ సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ ఎంతో కీలకమని, ప్రజలకు వీలైనంత త్వరగా విద్యుత్ సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. డోన్ నుంచి వెళ్లిన విద్యుత్ సిబ్బంది కాకినాడ ప్రాంతంలో అవసరమైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

# ఎంపీటీసీ నామినేషన్ల తిరస్కరణపై సీనియర్ న్యాయవాది ప్రభాకర్ రావు ఆగ్రహం

**రాజకీయ దురుద్దేశంతోనే అభ్యర్థుల తొలగింపు.. ఆర్డీవో, ఎన్నికల అధికారులతో వాదన**




**పోరుమామిళ్ల, అక్టోబర్ 26 (నంది పత్రిక):** మండల పరిషత్ ఎంపీటీసీ నామినేషన్ల తిరస్కరణపై సీనియర్ న్యాయవాది కె. ప్రభాకర్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నామినేషన్ దరఖాస్తుల్లో అన్ని వివరాలు సక్రమంగా సమర్పించినప్పటికీ, కొన్ని పత్రాలను తొలగించడం, చిన్నచిన్న కారణాలను చూపుతూ అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించడం అన్యాయమని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. ఎంపీటీసీ నామినేషన్ల తిరస్కరణలు రాజకీయ దురుద్దేశంతోనే జరుగుతున్నాయని ఆరోపించారు. ఒక పార్టీకి ప్రయోజనం చేకూర్చేలా ఎన్నికల ప్రక్రియలో వ్యవహరించడం సరికాదన్నారు. చిన్నచిన్న పొరపాట్ల కారణంగా నామినేషన్లను తిరస్కరించకూడదని ఎన్నికల కమిషన్ సూచించినప్పటికీ, ఆ మార్గదర్శకాలను పట్టించుకోకుండా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**ఎస్సీ, బీసీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఆరోపణ** ప్రజాస్వామ్యంలో ప్రజలే తమ ప్రతినిధులను ఎన్నుకోవాలని, అయితే నామినేషన్ల తిరస్కరణలతో ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులు పోటీకి దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ప్రభాకర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాల్సిన ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

**ఆర్డీవో, ఎన్నికల అధికారులతో వాదన** నామినేషన్ల తిరస్కరణల అంశంపై ఆర్డీవో, ఎన్నికల అధికారులతో తాను గట్టిగా వాదించినట్లు న్యాయవాది కె. ప్రభాకర్ రావు తెలిపారు. నామినేషన్ల పరిశీలనలో నిబంధనలను సమానంగా అమలు చేయాలని, రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని ఆయన కోరారు.నామినేషన్ల తిరస్కరణలపై ఉన్న అభ్యంతరాలను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# వాల్మీకి మహర్షికి ఘనంగా నివాళి



**బనగానపల్లె అక్టోబర్ 26నందిపత్రికి** వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా పట్టణ వాల్మీకులు మహర్షి కి ఘనంగా నివాళు లార్పించారు. బనగానపల్లె బోయపేట వెంకటసుబ్బయ్య బంగారు అంగడి నాగరాజు ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహం వద్దకు ర్యాలీగా బయలుదేరి మహర్షి విగ్రహానికి పూలమాలలతో సత్కరించి ఆయన చేసిన మహాత్కార్యముల గురించి పదిమందికి తెలియజేసి అనంతరం ప్రజలకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో నాగ భూపతి శ్రీహరి, నవీన్, నాగేశ్వరి, లక్ష్మేశ్వరి మొదలగువారు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు

# ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి.. అభ్యర్థులను గెలిపించండి

**ఎన్నికల ప్రచారంలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి**

**డోన్ నంది పత్రిక: అక్టోబర్ 26** డోన్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మూడో రోజు ప్రచారంలో భాగంగా పట్టణంలోని 29, 33, 34వ వార్డుల్లో పర్యటిస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. డోన్ పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణాన్ని కాపాడుకోవాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా ఆయా వార్డుల్లోని ఓటర్లను పేరు పేరున పలకరిస్తూ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయ చైతన్యతో పాటు 29, 33, 34వ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు గద్దం దుర్గ, దారా లక్ష్మీదేవి, మహేష్‌లను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.



# ఘనంగా వాల్మీకి జయంతి




**సిరివెళ్ల(నంది పత్రిక ):** సిరివెళ్ల మండలంలోని కామినేనిపల్లి గ్రామం వాల్మీకి కాలనీలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా జరుపు కున్నారు. గ్రామ పురోహితులు గౌరీ ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కామినేని పల్లె మాజీ సర్పంచ్ టిడిపి నాయకులు మెరువ నరసింహారెడ్డి దంపతులు హాజరై వాల్మీకి విగ్రహానికి పూజ నిర్వహించారు. మరియు మహిళలు, యువతులు, యువకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, కాయ కర్పూరం సమర్పించి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. తదానంతరం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా సాయంకాలం సమయంలో కోటపాడు గ్రామంలోవాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోటపాడు వాల్మీకి యువతి యువకులు అందరూ పాల్గొన్నారు.

## 38వ వార్డులో టీడీపీ అభ్యర్థుల విజయానికి కర్నూలు జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ప్రచారం

**కర్నూలు సిటీ నందిపత్రిక** 38వ వార్డు మెదరగేరిలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి మేదరి సరోజమ్మ ని, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మణి ని సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ , కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ, కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల కృషితో 38వ వార్డులో మేదరి సరోజమ్మ ని, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మణి ని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం యస్ రాజు, వడ్డెమన్ గోపాల్, హనుమంతూ, తిమ్మప్ప, పెద్ద చిట్టి, చిన్న చిట్టి, సాదిక్ వలి, భీమ, వెంకటేష్, నరేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు



# కౌంటింగ్ కేంద్రం చురుగ్గా ఏర్పాట్లు

**అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**
**మైదానంలో పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం ఏర్పాట్ల పరిశీలన**
**ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా కౌంటింగ్ కేంద్రం వద్ద చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. సోమవారం నగర శివార్లలోని అథెనా స్కూల్ ప్రాంగణంలో అధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. అథెనా స్కూల్ మైదానంలో పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం (రిసెప్షన్ సెంటర్), స్పోర్ట్స్ బిల్డింగ్ (ఇండోర్ స్టేడియం)లో స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేస్తున్నామని, ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ సమయంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా కొత్తగా మరో రహదారిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేలా సిసి కెమెరాలు, పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు గదుల్లో అవసరమైన సదుపాయాలు, అధికారుల విధుల నిర్వహణకు అనుకూలమైన ఏర్పాట్లు దాదాపు పూర్తి అయ్యాయన్నారు. కౌంటింగ్ కేంద్రం సమీపంలో పార్కింగ్ ప్రదేశాలకు ప్రత్యేక స్థలాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తామని చల్లా ఓబులేసు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈలు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, ఏఈలు జనార్దన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి



**జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ కి సంబంధించి పత్తికొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఆలూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఆదోని మండలం విరుపాపురం గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో , ఎమ్మిగనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర & బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి ఏర్పాటు చేసిన గదులను, స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాళ్లలో టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది రాకపోకలకు అనువైన మార్గాలు, రిసెప్షన్ కేంద్రాల నిర్వహణ, వాహనాల పార్కింగ్ నిర్వహణకు సంబంధించిన అంశాలను కలెక్టర్ పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. కౌంటింగ్ రూమ్ లోకి ఎంట్రన్స్ వద్ద బ్యారికేడింగ్ సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ రూమ్ లో ఎక్కువ లైటింగ్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ కేంద్రాలు పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, కౌంటింగ్ నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. కౌంటింగ్ రూమ్ లలో విద్యుత్ సరఫరా, లైటింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర అవసరమైన సౌకర్యాలను పరిశీలించి, లోపాలుంటే వెంటనే సరిచేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, భవనాల ముందు, వెనుక భాగాలు, ప్రవేశ ద్వారాలు, పరిసర ప్రాంతాల్లో అవసరమైన సంఖ్యలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోని ప్రతి కీలక ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించే విధంగా కెమెరాల ఏర్పాటు ఉండాలని, సీసీటీవీ ఫుటేజీని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు.. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సీసీటీవీ కెమెరాల ద్వారా లభించే ఫుటేజీని నిరంతరం పర్యవేక్షించేందుకు అవసరమైన మానిటర్లు, సాంకేతిక పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కౌంటింగ్ విధుల కోసం వచ్చే సిబ్బందికి వాహనాల పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునే మార్గాలు, ప్రవేశ ద్వారాలు, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లకు వెళ్లే దారులకు సంబంధించి స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. రిసెప్షన్ కేంద్రాల్లో విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించాలని, స్టాట్యూటరీ, నాన్-స్టాట్యూటరీ కౌంటర్లను అవసరానికి అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు.

**జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ**

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని కేంద్రాల్లో పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. కౌంటింగ్ కేంద్రాల వెనుక భాగాలు ఉండే ప్రాంతాల్లో వెలుతురు ఉండేలా ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే అన్ని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని ఒకేసారి వీక్షించే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, కీలక ప్రాంతాల్లో జరుగుతున్న కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, ఆదోని అదనపు ఎస్పీ జయ శర్మ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి: గుడిసె ఆది కృష్ణమ్మ

**మేదరిగేరిలో వాల్మీకి బోర్డు వద్ద పూజలు వాల్మీకి నగర్ దేవాలయంలో ప్రత్యేక పూజలు**



**కర్నూలు సిటీ నందిపత్రిక** వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఆదోని పట్టణంలోని మేదరిగేరిలో వాల్మీకి బోర్డు ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వాల్మీకి నగర్‌లోని వాల్మీకి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వాల్మీకి మహర్షికి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవితాన్ని, ఆయన అందించిన సందేశాలను స్మరించుకున్నారు. మహర్షి రచించిన రామాయణం మానవాళికి ధర్మం, నీతి, సత్యం, మానవతా విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో ఐకమత్యం, సోదరభావం, సామాజిక సమానత్వం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందించేలా నిర్వహించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వాల్మీకి సామాజిక వర్గ పెద్దలు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## కూటమి గెలుపుతోనే నగరంలో అభివృద్ధి కొనసాగుతుంది... ఎంపీ బస్తిపాటి నాగరాజు



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరం అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.. 51,54 వార్డుల్లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారాల్లో ఎం.ఎల్.ఏ బొగ్గుల దస్తగిరితో కలిసి ఆయన పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఎంపీ, ఎం.ఎల్.ఏ ఇంటింటికి తిరుగుతూ రెండు ఓట్లు సైకిల్ గుర్తు పై వేసి టీడీపీ మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష, టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థులు ఓబులేసు, జయ చంద్రలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.. అనంతరం ఎంపీ నాగరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ మేయర్, కార్పొరేటర్లు నగరంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చెప్పట్టలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నగరం అభివృద్ధి లో పరుగులు పెడుతుందన్నారు..అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే కూటమి మేయర్ అభ్యర్థి తో పాటు, కార్పొరేటర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీ కోరారు.

# చెప్పాం చేస్తున్నాం

**నిత్యం ప్రజల్లోనే ఉంటాం మమ్మల్ని 48,49 అభ్యర్థులను ఆదరించండి**
**మీ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తుపై వేసి వేయించండి**
**ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కమ్మరి పార్వతమ్మ**



**కర్నూలు సిటీ నందిపత్రిక** పాణ్యం నియోజకవర్గ శాసనసభ్యురాలు, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితా రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు మండలం 48వ వార్డు ఎలుకూరు బంగ్లాస్, వసుంధర ఇండిపెండెంట్ హౌసెస్,వసుంధర అపార్ట్మెంట్,ఏరియాలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగింది. ప్రతి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ విజయాలను ప్రజలకు తెలియజేస్తున్న టీడీపీ నాయకులుతెలుగుదేశం పార్టీ కర్నూలు మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూష ని, మరియు 48వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సుతారు రాఘవేంద్ర ని, 49 వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి బి . శివ పార్వతి ని సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించవలసిందిగా కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో 11వ క్లస్టర్ కో కన్వీనర్ కాసాని మహేష్ గౌడ్,48 వ వార్డు ఇన్చార్జి నాగేశ్వర రావు,టీడీపీ సీనియర్ కార్యకర్తలు, ఇమ్మనియల్, చిన్న మస్తాన్ భాషా, యం.కృష్ణ, పెద్ద మాధవస్వామి, బసవ రాజు, వడ్డే మౌలాలి,మధు, ప్రకాష్,సుంకాచారి, రాఘవేంద్ర, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి, కోట్ల సుజాతమ్మ



**డోన్ నంది పత్రిక అక్టోబర్26** డోన్ పట్టణంలో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, డోన్ మున్సిపల్ టీడీపీ చైర్మన్ అభ్యర్థి కోట్ల సుజాతమ్మ పాల్గొని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు వాల్మీకి మహర్షి జీవిత విశేషాలను, ఆయన సమాజానికి అందించిన సందేశాలను స్మరించుకున్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు విశేషమైన గుర్తింపు తీసుకొచ్చిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని పేర్కొన్నారు. ఆయన రచనలు మానవ జీవితానికి విలువైన మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నాయని తెలిపారు. వాల్మీకి మహర్షి చూపిన ధర్మమార్గం, సత్యనిష్ఠ, మానవతా విలువలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన బోధనలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం, నైతిక విలువలను పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను స్మరించుకుంటూ, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల జీవిత చరిత్రలను యువతకు తెలియజేయడం ద్వారా వారిలో స్ఫూర్తి, సేవాభావం పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు వాల్మీకి మహర్షికి ఘనంగా నివాళులర్పించి ఆయన ఆశయాలను స్మరించుకున్నారు.



# చిన్న వర్షానికే చెరువును తలపిస్తున్న రహదారి..!

## అవస్థలు పడుతున్న గ్రామస్థులు, ప్రయాణికులు..



**మహానంది అక్టోబర్ 26 (నంది పత్రిక):–** మహానంది మండలం గాజులపల్లి గ్రామం నుండి రుద్రవరం వెళ్లే ప్రధాన రహదారి చిన్న వర్షానికే చెరువును తలపిస్తోంది.సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోయి, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది.నీరు బయటకు వెళ్లే ఆస్కారం లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీల్లోకి నీరు చేరుతోందని, దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉన్న నీటి కారణంగా దోమలు విజృంభించి, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు.రోడ్డుపై భారీగా నీరు చేరడంతో వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డుపై నిల్వ ఉన్న నీటిని బయటకు పంపేలా తక్షణ చర్యలు చేపట్టాలని, శాశ్వత డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# కల్లూరు అర్బన్‌లో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం

## 37, 38, 39వ వార్డుల్లో కాటసాని విస్తృత ప్రచారం



**కర్నూలు సిటీ నందిపత్రిక** కల్లూరు అర్బన్ పరిధిలోని 37, 38, 39వ వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఆయా వార్డుల్లో పర్యటిస్తూ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా 37వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి హేమలత , 38వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి ఎద్దుల ప్రవళిక , 39వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి చిట్టిబాబు , కర్నూలు నగర మేయర్ అభ్యర్థి సుశీలమ్మ ని గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలను నేరుగా కలుసుకున్న కాటసాని రామభూపాల్ రెడ్డి వార్డుల్లోని సమస్యలు, అభివృద్ధి అంశాలపై ప్రజలతో మాట్లాడారు. పార్టీ అభ్యర్థులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకోవాలి

## రేపు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఫెసిలిటేషన్ సెంటర్

## దామోదరం సంజీవయ్య మెమోరియల్ పాఠశాలలో కేంద్రం ఏర్పాటు

## పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బందికి ఓటు వేసే అవకాశం

## అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు సిటీ నందిపత్రిక** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కర్నూలు నగరపాలక సంస్థ ఓటరు జాబితాలో పేరుండి, కర్నూలుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసు సిబ్బంది కోసం మంగళవారం ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. సోమవారం నగరంలోని పాత కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య మెమోరియల్ పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాట్లను పరిశీలించిన ఆయన, అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓటరు జాబితాలో పేరుండి, ఎన్నికల విధులు నిర్వహించే అర్హులైన పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రానికి వచ్చే సిబ్బంది కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేరుకు సంబంధించిన వివరాలు, ఎన్నికల విధులు కేటాయించినట్లు సంబంధిత అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. కేంద్రంలో గెజిటెడ్ అధికారుల ద్వారా అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు వివరించారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత సమయంలో ఫెసిలిటేషన్ సెంటర్‌కు చేరుకుని, అవసరమైన పత్రాలతో ప్రక్రియను పూర్తి చేసుకోవాలని చల్లా ఓబులేసు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రమణమూర్తి, డీఈఈ కృష్ణలత, టీపీఈ మహేష్ పాల్గొన్నారు.

# కర్నూలులో టీడీపీలోకి భారీగా చేరికలు

## మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన పలువురు నాయకులు, యువత

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలో మంత్రి టీజీ భరత్ నాయకత్వంపై నమ్మకంతో వివిధ వార్డులకు చెందిన పలువురు నాయకులు, యువత తెలుగుదేశం పార్టీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు టీడీపీలో చేరారు. నగరంలోని 29వ వార్డుకు చెందిన డిష్ రాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే 2వ వార్డుకు చెందిన అడ్వకేట్ మోషేష్ బాబు, 19వ వార్డుకు చెందిన షేక్ నజీమా బేగం టీడీపీలో చేరారు. 13వ వార్డుకు చెందిన యువత కూడా తెలుగుదేశం పార్టీలో చేరి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి టీజీ భరత్ నాయకత్వం, కర్నూలు నగర అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషి తమకు నచ్చడంతోనే తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోందని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు.



# ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై ఆరా తీసిన డి ఎం హెచ్ ఓ.

## అందుబాటులో ఉండాల్సిందేనని వైద్యులకు ఆదేశాలు.



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 26 (నంది పత్రిక):** మండల కేంద్రం రుద్రవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ శారదా బాయ్ సందర్శించారు. జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపి సేవలు, మందుల నిలువలు, ల్యాబ్ సౌకర్యాలు, ప్రసూతి వార్డు ఆమెకు క్షుణ్ణంగా పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, హాజరు రిజిస్టర్ లను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి తప్పనిసరిగా అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కేంద్రానికి రాలేని పక్షంలో ముందుగా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి గైరాజరైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారం : ఎస్ఐ శివాంజల్



**మహానంది అక్టోబర్ 26 (నంది పత్రిక):–** ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. మహానంది మండలంలోని ఎం సి ఫారం గ్రామం సమీపంలో గల ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో సోమవారం 'యాంటీ ర్యాగింగ్, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలు' అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కళాశాల అసోసియేట్ డీన్ డా. చవన్ శ్యామరాజ్ నాయక్ ముందుగా ప్రసంగిస్తూ.. ర్యాగింగ్ చేయడం అనేది సరదా కాదని, అది క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడితే తీవ్రమైన చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని విద్యార్థులను హెచ్చరించారు. అనంతరం ఎస్సై శివాంజల్ మాట్లాడుతూ.. ర్యాగింగ్ వల్ల కలిగే మనోవేదనతో కొన్ని సందర్భాల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అందుకే ప్రభుత్వాలు ఈ విషయంలో అత్యంత కఠినమైన చట్టాలను తీసుకువచ్చాయని తెలిపారు. విద్యార్థులు గనుక పోలీస్ కేసుల్లో చిక్కుకుంటే వారి భవిష్యత్తు పూర్తిగా అంధకారమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల ఆశయాలను గుర్తుంచుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించేలా చదువుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ర్యాగింగ్ నిరోధక చట్టాలు, వివిధ ఐపీసీ సెక్షన్ల గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వన్య ప్రాణులు వాటి ఆవాసాల సర్వే.



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 26 (నంది పత్రిక):** రుద్రవరం అటవీ రేంజ్ లోని అన్ని ఫారెస్ట్ బీట్ లలో వన్యప్రాణులు వాటి ఆవాసాల సర్వే నిర్వహిస్తున్నట్లు రుద్రవరం రేంజ్ అధికారి ముర్తుజావలి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల డిడి పిటి సి. చైతన్య కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 23 నుంచి 28 తేదీ వరకు రుద్రవరం రేంజ్ లో ఏ ఐ టి ఈ -2026 లో భాగంగా వన్యప్రాణులు అటవీ ఆవాసాల సర్వే నిర్వహిస్తున్నమన్నారు. ఇందులో భాగముగా మొదటి మూడు రోజులు ప్రతి బీట్ కి 5 కిమిచొప్పున రుద్రవరం రేంజ్ పరిధి లోని 14 బీట్ల లో కాలినడకన అటవీ శాఖ సిబ్బంది తిరిగి ప్రత్యక్షంగా చూసిన మాంసాహార జంతువులు అయినటువంటి పులి, చిరుత, ఎలుగుబంటి, రేస్ కుక్క ,అడవి పిల్లి మొదలగు వాటిని మరియు పరోక్ష ఆనవాలు అయినటువంటి వాటి పాదముద్రలు మరియు విసర్జించిన పెంటికలను సేకరించడం జరుగుతుంది.తర్వాత మూడు రోజులు శాకాహార జంతువులు చుక్కల దుప్పి, కొండ గొర్రె ,అడవి పంది, సాంబార్, మనుబోతు వంటి వాటి జనాభను అంచనా వేయుటకు ప్రతి బీట్ లో ఉదయం సుమారు 6 గంటలకి రోజుకి2 కి మీ ట్రెండ్స్ చొప్పున 3 రోజులు ⁻తీఘఅయిఖ్ శ్రీఐఅవ లో ఒకే దిశలో కాలి బాటన తిరిగడం జరుగుతున్నది.అలాగే అటవీ ఆవాసం ను అంచనా వేయడం జరుగుతుంది. ఇందులొ రుద్రవరం రేంజ్ అటవీ శాఖ సిబ్బంది తోపాటు డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ నుంచి వచ్చిన వాలంటీర్లు కూడా ఈ సర్వేలో పాల్గొంటున్నారన్నారు.

# వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఘన నివాళులు

## జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ

## జిల్లా బీసీ సంక్షేమ అధికారి ప్రసూన



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో సోమవారం వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, కార్యాలయ పరిపాలన అధికారి రవి కుమార్ తదితరులు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలు సమర్పించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవిత విశేషాలను, సమాజానికి ఆయన అందించిన విలువైన సందేశాలను స్మరించుకున్నారు. భారతీయ సాహిత్యంలో ఆదికవిగా ప్రసిద్ధి చెందిన మహర్షి వాల్మీకి రచించిన రామాయణం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆయన అందించిన ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలు సమాజానికి స్ఫూర్తినిస్తున్నాయని గుర్తుచేశారు. వాల్మీకి మహర్షి జీవితం, ఆయన సాహిత్య సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన బోధనలు సమాజంలో నైతిక విలువలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. మహర్షి ఆశయాలను స్మరించుకుంటూ సమాజ అభ్యున్నతికి, సద్గుణాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహన ఉండాలి

## అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు

## సూపర్వైజర్లు, సహాయకులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ

## రెండు అంతస్తుల్లో 145 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు

## మొత్తం 820 మంది కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహనతో ఉండాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్) నందు ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే సూపర్వైజర్లు, సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు విధానంపై ప్రాయోగిక ప్రదర్శనతో అవగాహన, బ్యాలెట్ పత్రాల విభజన, ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిబ్బంది విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం రెండు అంతస్తుల్లో మొత్తం 145 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో కార్పొరేటర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం 72 టేబుళ్లు, మేయర్ అభ్యర్థి ఓట్ల లెక్కింపు కోసం 73 టేబుళ్లను కేటాయించినట్లు వివరించారు. ప్రతి కౌంటింగ్ టేబుల్‌కు ఒక సూపర్వైజర్‌తో పాటు నలుగురు సహాయకులను నియమించినట్లు తెలిపారు. అదనంగా 10 శాతం సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. మొత్తం 820 మంది సిబ్బందికి ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.బ్యాలెట్ పత్రాల్లో మేయర్ అభ్యర్థులకు సంబంధించినవి పింక్ రంగులో, కార్పొరేటర్ అభ్యర్థులకు సంబంధించినవి తెలుపు రంగులో ఉంటాయని తెలిపారు. బ్యాలెట్ పత్రాలు కలిపి ఉంటాయని, తొలుత వాటిని మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల పత్రాలను వేర్వేరుగా విభజించాల్సి ఉంటుందన్నారు. అనంతరం బ్యాలెట్ పత్రాలను 25 పత్రాల చొప్పున కట్టలుగా కట్టి, ప్రతి రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను లెక్కించే విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కోసం ఎదురెదురుగా టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.ఓట్ల లెక్కింపు సమయంలో ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, బ్యాలెట్ పత్రాల విభజన నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాల నమోదు వరకు ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితత్వంతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేనేజర్ జునైద్, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్ ఇశ్రాయోలు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు .

# మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు.

## మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్.

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి జీవితాన్ని, ఆయన రచించిన రామాయణం ద్వారా సమాజానికి అందించిన ధర్మం, నీతి, సత్యం వంటి విలువలను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ, ఆర్ ఎస్సైలు, స్పెషల్ పార్టీ పోలీసులు, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు.



# కర్నూలు 56వ వార్డులో బి యస్ పి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూల్ నగరంలోని లేబర్ కాలనీ, పాల కొట్టాలు 56వ వార్డు బీఎస్పీ కార్పొరేటర్ అభ్యర్థి దాదేపోగు రామాంజనేయులు తరపున కర్నూలు జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్ కార్యకర్తలతో కలిసి ఓటర్లను కలిశారు.

**ఏనుగు గుర్తు కే మన ఓటు నెంబర్ . 2**

"మొదటిసారిగా నా కుటుంబం తరపున ఓటు అడుగుతున్నాడ ఆదరించండి"

ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో తనకు ఓటు వేయమని వ్యక్తిగతంగా ఎప్పుడూ అడగలేదని, తొలిసారిగా తన కుటుంబం తరపున ఓటు అడుగుతున్నానని అన్నారు.ఇది ఈ ప్రచారానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజల ఆదరాభిమానాలే తమకు కొండంత బలమని చెప్పారు.

**మీ ఓటు ఏనుగు గుర్తుకే**

**కార్పొరేటర్ అభ్యర్థి: దాదేపోగు రామాంజనేయులు**

మేయర్అభ్యర్థి: శ్రీమతి అమడగుంట్ల శాంతి ఏనుగు గుర్తుపై ఓటు వేసి, మన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించండి.

ఈ కార్యక్రమంలో డి రామాంజనేయులు, ఆర్ ప్రసాద్, పి రవి ప్రసాద్, టి రాజశేఖర్, కె నల్లన్న, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వార్డు పెద్దలు పాల్గొన్నారు.

# కర్నూలు రెండవ వార్డులో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం

**కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి డాక్టర్ కె. తామర వేణితో కలిసి ప్రచారంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి జె. లక్ష్మీ నరసింహ యాదవ్**



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో రెండవ వార్డులో కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి డాక్టర్ కె. తామర వేణి, రెండవ వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి ఎం సుంకన్నతో కలిసి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యులు జె. లక్ష్మీ నరసింహ యాదవ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలను, స్థానిక ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలను, ప్రజల సంక్షేమం కోసం పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. కర్నూలు నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, తాగునీటి సమస్య పరిష్కారం, పారిశుద్ధ్యం, రహదారుల అభివృద్ధి వంటి ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వాన్ని ప్రజలు ఆదరించాలని ఈ సందర్భంగా కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి, ఎన్నికల్లో విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటికీ వెళ్లి పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని జె. లక్ష్మీ నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, నంద్యాల డిసిసి అధ్యక్షులు జనార్ధన్, కాంగ్రెస్ నాయకులు మహేంద్ర, సంజీవ్, రామాంజనేయులు, కల్లూరు ప్రభాకర్ రెండు మూడు వార్డుల ప్రజలు ప్రజలు పాల్గొన్నారు.

# వైభవంగా దిగువ అహోబిలంలో పవిత్రోత్సవాలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 26, నంది పత్రిక** శ్రీ అహోబిల మఠం పరంపరాధీన దిగువ అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సోమవారం పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. మొదటిరోజు వివిధ వైదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఆలయ సంప్రదాయాల ప్రకారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచి విశ్వరూప దర్శనంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నవకలశ తిరుమంజనం, నిత్య పూజ నిర్వహించారు. అనంతరం ద్వారతోరణం పూజతో పాటు మండల ప్రతిష్ఠ, కుంభ ప్రతిష్ఠ, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం వరకు హోమ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పవిత్రారోపణం కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, లోకక్షేమం, సర్వజన సౌభాగ్యం కోసం పూజలు చేశారు.

# కర్నూలు నగరంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం, పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ...

**కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్**

**ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు.**

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగర పాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో సోమవారం గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని అథీనా స్కూల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, వెంకటరమణ కాలనీ వెనుక ఉన్న కేశవరెడ్డి స్కూల్, శ్రీజ స్కూల్ పోలింగ్ కేంద్రాలతో పాటు ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్ పరిశీలించారు.ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు అధికారులు , పోలీసు సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు .స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కొనసాగిస్తూ నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. కర్నూలు రేంజ్ డీఐజీ తో పాటు కర్నూలు తాలూకా సీఐ తేజమూర్తి ఉన్నారు.



# అవినీతికి పాల్పడే వారిపై ఏసీబీకి ఫిర్యాదు చేయండి...!

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**1064 టోల్‌ఫ్రీ నంబర్‌పై విస్తృత ప్రచారం చేయాలి**




**కడప బ్యూరో చీఫ్, అక్టోబరు 26: నంది పత్రిక** ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా ప్రజలు నిర్భయంగా అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రచార పోస్టర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ సేవలు పొందే సమయంలో ప్రజలు లంచం ఇవ్వాల్సిన పరిస్థితులు ఎదురైతే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064తో పాటు, వాట్సాప్ నంబర్ 94404 40057 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చనే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు.ఏసీబీ ఫిర్యాదు నంబర్లను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించి, అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడప రేంజ్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి. నాగరాజు, సంబందిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి శానిటేషన్ సిబ్బందికి రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం



**కర్నూలు సిటీ నందిపత్రిక** ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవి శ్యామల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ కె. మాధవి శ్యామల మాట్లాడుతూ, రొమ్ము క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండటం ఎంతో ముఖ్యమని తెలిపారు. రొమ్ములో గడ్డలు ఏర్పడటం, ఆకారంలో మార్పులు రావడం, చనుమొనల నుంచి అసాధారణ స్రావాలు రావడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స పొందే అవకాశం ఉంటుందని వివరించారు.మహిళలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. రొమ్ము క్యాన్సర్‌పై ఉన్న అపోహలను తొలగించుకుని, వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్సపై సరైన అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రిలో విధులు నిర్వహించే శానిటేషన్ సిబ్బంది తమ కుటుంబ సభ్యులకు, పరిచయస్తులకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా లక్ష్మీ భాయ్ , సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డా పార్వతీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా విమల, పీ.జీ లు డా లావణ్య, డా హారికాంజలి పాల్గొన్నారు.

# జిద్దాలో చిక్కుకున్న ఉమ్రా యాత్రికులను తక్షణమే స్వదేశానికి తీసుకురావాలి

**మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ విజ్ఞప్తి**



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు ప్రాంతానికి చెందిన పది మంది ముస్లింలు నంద్యాల ఉమ్రా గ్రూప్ ద్వారా అల్ ఇన్ఫోటెక్ ఉమ్రా గ్రూప్ ఆధ్వర్యంలో పవిత్ర ఉమ్రా యాత్రకు సౌదీ అరేబియాకు వెళ్లారు. అయితే విమాన సర్వీసులు రద్దు కావడంతో వారు స్వదేశానికి తిరిగి రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కర్నూలు జిల్లా కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. ఉమ్రా యాత్రకు వెళ్లిన వారు స్వదేశానికి తిరిగి రావడానికి ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్ర విదేశాంగ శాఖ, భారత ప్రభుత్వం అత్యవసరంగా పరిగణించాలని ఆయన కోరారు. సౌదీ అరేబియా అధికారులతో, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకొని విమాన ప్రయాణ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విమాన సర్వీసులు రద్దు కావడం వల్ల విదేశంలో చిక్కుకున్న యాత్రికులకు అవసరమైన వసతి, ఆహారం, వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ విమాన ఏర్పాట్లు చేసి వారిని వీలైనంత త్వరగా సురక్షితంగా భారతదేశానికి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వారి కుటుంబ సభ్యులు తమ ఆత్మీయుల రాక కోసం ఆందోళనతో ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని బాధితులకు భరోసా కల్పించాలని షేక్ ఖాజా హుస్సేన్ విజ్ఞప్తి చేశారు. "విదేశాల్లో చిక్కుకున్న మన ఉమ్రా యాత్రికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడం అత్యంత ప్రాధాన్యతతో కూడిన మానవతా బాధ్యత. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఖాజా హుస్సేన్ కోరారు.

# "కూటమి మోసాలను ఎదిరిద్దాం.. నంద్యాలలో ఫ్యాన్ జెండా ఎగరేద్దాం!"

**కూటమి ప్రభుత్వంపైమాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి నిప్పులు చెరిగారు!**



**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 26 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో సుపరిపాలన, సమగ్రాభివృద్ధి మళ్లీ సాధ్యం కావాలంటే వైఎస్సార్సీపీనే ఏకైక శరణ్యమని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన దగాకోరు కూటమి ప్రభుత్వానికి నవంబర్ 1న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఆయన ఉద్వేగభరితంగా పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని 25, 28, 29, 31 వార్డులలో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారంలో శిల్పా రవిరెడ్డి కదిలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి తీవ్ర ఆవేశంతో ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థులు శ్వేత, కామిని రాజశేఖర్ రెడ్డి, యల్లంపల్లి శివశంకర్ రెడ్డి, గంగా చరణ్ రెడ్డి మరియు చైర్మన్ అభ్యర్థి అమీర్ బాష (దాల్మిల్ అమీర్) లను ఫ్యాన్ గుర్తుపై భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష తదితరులు పాల్గొన్నారు.

**కూటమి సర్కార్‌పై విరుచుకుపడ్డ శిల్పా రవిరెడ్డి:**

మోసపూరిత వాగ్దానాలు: ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్' అంటూ ఆకాశమే హద్దుగా హామీలిచ్చి ఓట్లు దండుకున్న కూటమి నాయకులు, నేడు అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచారని, నంద్యాల ప్రజలను మోసంతో దగా చేశారని మండిపడ్డారు.

ప్రశ్నిస్తే కక్షసాధింపులేనా?: ప్రజలు తాము ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని నిలదీస్తే వారిపైనే ఎదురుదాడి చేస్తున్న ఈ మోసపూరిత నేతల మాటలను ఇకపై నమ్మవద్దని ఆయన హెచ్చరించారు. గత పాలనే మనకు రక్ష: వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో గడపగడపకు వెళ్లి ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించామని, నంద్యాల నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి ఫలాలను అందించామని గుర్తుచేశారు. నేడు టీడీపీ నాయకులు 'ఇంటింటికి తెలుగుదేశం' అంటూ వస్తున్నారని, ఓట్లు అడిగేసి వెళ్లిన వీరు ఎప్పుడైనా మీ సమస్యల కోసం మీ ఇంటి ముంగిటికి వచ్చారా అని సూటిగా నిలదీశారు.

**నంద్యాల గడ్డపై ఫ్యాన్ జెండా ఎగరడం ఖాయం!**

శిల్పా సేవా సమితి ద్వారా తాము చేపడుతున్న నిరంతర ప్రజా సేవలను సైతం రాజకీయ కక్షలతో అడ్డుకోవాలని చూసిన కుట్రలను ప్రజలు గమనించాలని శిల్పా రవిరెడ్డి హితవు పలికారు. నంద్యాల భవిష్యత్తును, సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్క ఓటరు నవంబర్ 1వ తేదీన జరిగే మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి, అఖండ విజయంతో రికార్డు సృష్టించాలని ఆయన తీవ్ర భావోద్వేగంతో కోరారు.



# శ్రీశైలం దేవస్థానంలో హుండీల లెక్కింపు





**శ్రీశైలం అక్టోబర్ 26(నంది పత్రిక)** (26.10.2026 ) జరిగిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 4,22,29,240 /-లు నగదు రాబడిగా లభించింది.

కాగా ఈ హుండీల రాబడిని భక్తులు గత 32 రోజులలో ( 24.09.2026 నుండి 25.10.2026 వరకు) సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 75 గ్రాముల 300 మిల్లీగ్రాముల బంగారం, 2 కేజీల 900 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 417 – యుఎస్‌ఏ డాలర్లు, 65 యు.ఏ.ఇ దిర్హామ్స్, 60 ఇంగ్లాండు పౌండ్స్, 100 కెనడా డాలర్లు, 500 ఓమన్ బైసా, 1 – ఓమన్ రియాల్, 25 యూరోస్, 2– మలేషియా రింగిట్స్, 10 – సౌదీరియాల్స్, 10 న్యూజిలాండ్ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు , 10 ఈజిప్ట్ ఫౌండ్స్ మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అదేవిధంగా హుండీల లెక్కింపులో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎస్. చంద్రశేఖర్, పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# పందిపాడులో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కల్లూరు మండలం పందిపాడు గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి జయంతిని గత 35 సంవత్సరాలుగా నిర్వహిస్తూ ఉన్నారు. గ్రామంలోని వాల్మీకి సమాజంలో మూడు మేటీలు మీ ఉన్నాయని ఒక్కొక్క మీటింగ్ ఒక ఏడాది చొప్పున ఈ వేడుకలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా మేటీల పెద్దలు పూల శివశంకర్ బీజే రామకృష్ణ బంగిశంకర్ మాట్లాడుతూ గ్రామంలోని బొడ్రాయి వద్ద జరిగే పూజా కార్యక్రమాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని కూడ పెట్టి వాల్మీకి జయంతి నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు అలాగే ఆలయ ఆదాయాన్ని పెందుతూ ప్రతి ఏడాది శ్రీరామనవమి వేడుకలు శ్రీ మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. వాల్మీకి సమాజానికి ఎలాంటి సమస్య ఎదురైనా అందరూ ఐక్యమై సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు రాజకీయంగా ఎన్నికలు వచ్చినా వివిధ పార్టీలకు అభ్యర్థులుగా పోటీచేసినా ఓట్లు వేసే వరకు పరిమితమే గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ ఐక్యమత్యంతో ముందుకు వెళ్తామని తెలిపారు. వాల్మీకి మహర్షికి ఉదయాన్నే భూపతి దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగింపు చేశారు కార్యక్రమంలో రామాంజనేయులు మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు బి జె శ్రీనివాసులు జింగిరి శంకరన్న వెంకటేశ్వర్లు (ఫోర్) మద్దిలేటి మహిళలు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## టిడిపి మేయర్ అభ్యర్థి ప్రత్యూషను, కార్పోరేటర్లు దాసరి శృతి, నరసింహ బాబును గెలిపించండి

### సెరీన్ నగర్లో రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా కల్లూరు అర్బన్ సెరీన్ నగర్లో నిర్వహించిన రోడ్ షో కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూల్ కార్పొరేషన్ టిడిపి మేయర్ అభ్యర్థి ప్రత్యూషను, 38 వ వార్డు అభ్యర్థి దాసరి శృతి, 38 వ వార్డు అభ్యర్థి కె నరసింహ బాబులకు మీ అమూల్యమైన రెండు ఓట్లు సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వార్డ్ లలో రోడ్ షో లో పర్యటించి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్పొరేషన్ లో కూడా కూటమి అభ్యర్థుల గెలుపుతో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఎస్ కె శ్రీనివాసరావు, ఎరుకలి కుమార్, వీరేంద్ర కుమార్, రామకృష్ణ, ఎరుకలి బబ్లూ, ఎరుకలి వంశీ, సర్దార్, కుమ్మరి శ్రీనివాసులు, రామకృష్ణ, లింగన్న, అబ్దుల్లా, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 10వ డివిజన్ కార్పొరేటర్ గా ఇప్పర్ల నాగేంద్ర ఏకగ్రీవ ఎన్నిక



**కడప అక్టోబర్ 26 (నంది పత్రిక రిపోర్టర్)** నగర పాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా 10వ డివిజన్ నుంచి తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి ఇప్పర్ల నాగేంద్ర ఏకగ్రీవంగా కార్పొరేటర్ గా ఎన్నికయ్యారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఆయన విజయ ధ్రువీకరణ సర్టిఫికెట్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న 10వ డివిజన్ ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## 36, 37వ వార్డు కార్పొరేటర్ లను గెలిపించండి

### టిడిపి యువ నాయకులు గౌరు జనార్ధన్ రెడ్డి ఎన్నికల ప్రచారం



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ పరిధిలోని 36, 37వ వార్డులలో పోటీ చేస్తున్న టిడిపి కార్పొరేటర్ అభ్యర్థులు వి శైలజ యాదవ్ రెడ్డిపోగు మరియమ్మలను గెలిపించాలని ఆ పార్టీ యువ నాయకులు గౌరు జనార్ధన్ రెడ్డి ఓటర్లను కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు అర్బన్ 36, 37వ వ వార్డులలో కార్పొరేటర్ అభ్యర్థులతో కలిసి గౌరు జనార్ధన్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అలాగే మేయర్ అభ్యర్థి విజయ ప్రత్యూష సైకిల్ గుర్తుపై మరొక ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గౌరు జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావు యాదవ్, నాయకులు గుణంపల్లి శ్రీనివాసరెడ్డి, రేణుక మల్లికార్జున యేసు, కానుగుల రామకృష్ణ, రెడ్డిపోగు చిరంజీవి, ఆర్ జె ఫిలిప్, పౌలు, కాలని మహిళలు,మరియు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అవినీతి నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

### యువత, విద్యావంతులు కీలక పాత్ర పోషించాలి

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 26(నంది పత్రిక):-** అవినీతి రహిత సమాజ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని, సమాజాభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అవినీతి నిర్మూలనలో యువత, విద్యావంతులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అవినీతి నిరోధక 1064 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో అవినీతి నిరోధక చైతన్యం పెంపొందించి, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈనెల 26 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్ల ప్రదర్శన, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు, విజిలెన్స్ అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 30న టోల్‌ఫ్రీ నంబర్ 1064పై ఎఫ్‌ఎం రేడియో ద్వారా ప్రచారం చేపట్టి, అక్టోబర్ 31న మండల కేంద్రాల్లో ప్రజలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐ రామాంజనేయులు, ఎస్ఐ సుబ్బరాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ధనస్వామ్యానికి ప్రజాస్వామ్యానికి పోరాటం చేస్తుంది ఒకేఒక పార్టీ సిపిఐ

### నిత్యం ప్రజా సమస్యలే ధ్యేయంగా పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ

### కంకి కొడవలి గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి వేయించండి



**కర్నూలు సిటీ నందిపత్రిక** ధనస్వామ్యానికి ప్రజాస్వామ్యానికి మధ్య జరుగుతున్న పోరాటంలో నిత్యం ప్రజా సమస్యల పరిష్కరమే ధ్యేయంగా పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ అభ్యర్థులు 17,21, 27,51 వార్డులలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు 17వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి గెడ్డమ్మ బంగారుపేట, ఫిషర్ కాంపౌండ్, కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కార్పొరేటర్ అభ్యర్థి కంకి కొడవలి గుర్తుకు మేయర్ అభ్యర్థి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను కోరారు ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు బిసన్న, సురేష్, ఏఐవైఎఫ్ నగరనాయకులు అఖిల్ తదితరులు పాల్గొన్నారు 21వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి అభ్యర్థి చింతల పెద్ద రామాంజలి ఎల్పిజి, గిరిప్రసాద్ నగర్, ఎస్ వి రెసిడెన్సి లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు 27 వ వార్డు లో అభ్యర్థి సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి మేయర్ క్యాంప్ ఆఫీస్ ఏరియా, రాజేశ్వరి నగర్, శకుంతల కళ్యాణ మండపం ఏరియాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ శ్రావణి నగర కార్యవర్గ సభ్యులు భద్ర కుమారు బి.వెంకటేశు పాల్గొన్నారు 51వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి గొల్ల శ్రీకాంత్ విజయలక్ష్మి 2, సంతోష్ నగర్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె శ్రీనివాసులు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐవైఎఫ్ నగరనాయకులు చంటి, సిపిఐ నగరనాయకులు ఆశా బేగం, చంద్ర లీల, బాలకృష్ణ, మాలికు నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి మండిపల్లి ని మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్ బోనుమల ఖాదర్ వలీ



**అన్నమయ్య అక్టోబర్ 26 (నంది పత్రిక రిపోర్టర్)** అన్నమయ్య జిల్లాలోని రాయచోటి మున్సిపాలిటీలో 44కు 44 వార్డులను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్న కూటమి తరఫున, లినూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ బోనుమల ఖాదర్ వలీ , కౌన్సిలర్లు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించి, విజయంలో కీలక పాత్ర పోషించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నూతన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు లిశుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రాయచోటి పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

## శ్రీ మద్దిలేటీ స్వామి దేవస్థానంలో వివిధ రకాల లీజులకు బహిరంగ వేలం.





**బేతంచెర్ల అక్టోబర్ 26 ( నంది పత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామ పరిధిలో వెలసి ఉన్న శ్రీ మద్దులేటీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నకు సంభందించిన వివిధ రకాలైన టోల్ గేట్, కొబ్బరి కాయలు అమ్ముకునే హక్కు కొరకు కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొనుటకు, కుంకుమ అమ్ముకునే బంకుకు లీజు కొరకు, శనివారం పూలు అమ్ముకొనేందుకు, డైలీ పూలు అమ్ముకొనుటకు లీజు, తాత్కాలిక అంగల్లనుండి రుసుము వసూలు హక్కు మరియు షాపులు మొదలగు వాటిపై, దేవస్థానం హక్కు భుక్తమైన వివిధ రకాల లీజు కొరకు బహిరంగ వేలము 27/10/2026 అనగా మంగళవారం ఉదయం 10 గంటల నుండి శ్రీ స్వామి వారి దేవస్థానం ఆవరణలో ఉప కమిషనర్ & శ్రీ మద్దులేటీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం కార్య నిర్వహణ అడిగికారి ఎం. రామాంజనేయులు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్య, ధర్మ కర్తల మండలి సభ్యుల సమక్షంలో బహిరంగ వేలము పాటలు నిర్వహించ బడునని సోమవారం తెలిపారు.

## గూడూరు నగర పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్,కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

**కర్నూలు సిటీ నందిపత్రిక** గూడూరు నగర పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారధి తో కలిసి కోడుమూరు టీడీపీ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి డమాం సునీతా భాయ్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే నగర పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో కూటమి వార్డు సభ్యుల అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి, కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రజల ఆదరణతో కూటమి అభ్యర్థులను ఘన విజయం వైపు నడిపించాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు జనసేన ఇంచార్జి అకేపోగు రాంబాబు , గూడూరు టౌన్ ప్రెసిడెంట్ రామాంజనేయులు , రేమట వెంకటేష్, కోడుమూరు శశావలి,చంటి, బుడంగలి, పౌలు, సులేమాన్ ,గూడూరు నగరపంచాయతీ కూటమి వార్డ్ మెంబర్లు,కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు



## విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్2026 సందర్భంగా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించిన కర్నూల్ ఏసీబీ కోర్ట్ న్యాయమూర్తి యన్. విద్య



**కర్నూలు సిటీ నందిపత్రిక** కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 26 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరుపబడుతున్న విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్2026 కార్యక్రమంలో భాగంగా, సోమవారం అనగా 26-10-2026 న ఉదయం, కర్నూల్ జిల్లా ఏసీబీ కోర్ట్ న్యాయమూర్తి ఎన్ . విద్య ఏసీబీ కోర్ట్ ఆవరణలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) టోల్ ఫ్రీ నంబర్ 1064 ను ప్రజలకు తెలియజేసే పోస్టర్లు మరియు స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరవ ఏసీబీ న్యాయమూర్తి మాట్లాడుతూ, అవినీతి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిర్వర్తించడానికి ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే, ప్రజలు సంకోచం లేకుండా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను క్రింది ఫోన్ నంబర్ల ద్వారా కూడా తెలియజేయవచ్చని ప్రజలకు సూచించారు.

ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్: 1064

ఏసీబీ డీఎస్పీ, కర్నూల్ సెల్ నంబర్: 9440446178

ఏసీబీ ఇన్‌స్పెక్టర్, కర్నూల్ సెల్ నంబర్: 9491305629

ఏసీబీ కార్యాలయం, కర్నూల్ ల్యాండ్‌లైన్ నంబర్: 08518-273783

ఈ కార్యక్రమంలో కర్నూలు పట్టణం లోని వివిధ న్యాయాధికారులు; ఏసీబీ డీఎస్పీ జి .సీతారామరావు, ఏసీబీ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య తో పాటుగా ఏసీబీ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రామ్ భగవాన్ , శ్రీనివాసులు , ప్రేమ్ సాగర్ గారు మరియు ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవినీతి నిరోధక చర్యలపై అవగాహన పెంపొందించడం, లంచం డిమాండ్ చేసే వారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలను ప్రోత్సహించడం, ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

## వైఎస్ జగనన్న పథకాలే గెలుపు మంత్రం

### జడ్పీటీసీ అభ్యర్థిగా బిఫాం అందజేసిన మందాల శివారెడ్డి

### చాప కింద నీరులా మందాల ప్రచారం



**శిరివెళ్ల (నంది పత్రిక) :-** అభివృద్ధి ఒకవైపు ప్రజా సంక్షేమం మరోవైపు రామరాజ్యాన్ని తలపించిన జగనన్న అభివృద్ధి సంక్షేమ పథకాలే తన గెలుపు మంత్రం అని శిరివెళ్ల జడ్పీటీసీ అభ్యర్థి మందాల శివారెడ్డి చాప కింద నీరులా జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో ఎన్నికల అధికారులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి శిరివెళ్ల జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీలో ఉంటూ వైసిపి పార్టీ తరుపున బిఫాం అందజేశారు. ఈ సందర్భంగా మందాల శివారెడ్డి మీడియాతో మాట్లాడుతూ జడ్పీటీసీ ఎన్నికల్లో రాజన్న రాజ్యాన్ని జగనన్న పాలనను ఓటర్లకు గుర్తు చేస్తూ నాడు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే ప్రచార అస్త్రంగా ప్రజల్లోకి వెలుతున్నట్లు మందాల శివారెడ్డి తెలియజేశారు. ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి గారు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి గారి నాయకత్వంలో వైయస్సార్ క్యాడర్ బలంగా ఉన్నదని నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు అక్రమాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. శిరివెళ్ల మండలంలో గంగుల నాయకత్వాన్ని మరింత పటిష్టపరిచేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేసి ప్రజల మద్దతు కూడగట్టి ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని మందాల తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో రైతన్నలు విలవిలలాడుతున్నారని అదే జగనన్న పాలనలో పాడి పంటలు పుష్కలంగా పండి మద్దతు ధర లభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జై జగన్ జై గంగుల

## పవిత్ర ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

### అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 26, నంది పత్రిక** మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి సోమవారం నాడు అహోబిలం శ్రీ ప్రహ్లాద వరద స్వామి వారిని దర్శించుకున్నారు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు స్వామి వారి ఆశీస్సులు పొందారు అనంతరం ఆయన పవిత్ర ఉత్సవాలలో పాల్గొన్నారు. ఆయన వెంట వైకాపా నాయకులు మాజీ ఆళ్లగడ్డ మండల వైస్ ప్రెసిడెంట్ నా సారీ లక్ష్మీ నరసింహ ప్రసాద్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్లో ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**మహానంది అక్టోబర్ 26 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ లో 2026-2027 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అనుమతి లభించిందని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వివిధ కారణాలతో చదువును మధ్యలో ఆపేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 31 లోపు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలన్నారు. ఓపెన్ టెన్త్ 100 సీట్లు, ఇంటర్మీడియట్ 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హత ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో లేదా ఆన్లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని పూర్తి వివరాల కోసం పాఠశాలను సంప్రదించాలని కోరారు.

## బీ-ఫారం అందజేసిన నిమ్మకాయల శ్రీనివాసరెడ్డి.

### హాజరైన వైసీపీ నాయకులు



**శిరివెళ్ల : (నంది పత్రిక)** సిరివెళ్ల మండలంలో వైసీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. చెన్నూరు ఎంపీటీసీ స్థానానికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చెన్నూరు మాజీ సర్పంచ్ మెరువ నాగభూషణం రెడ్డి, ఇసుకపల్లె రాంభూపాల్ రెడ్డి,హరిచంద్ర రెడ్డి, రమణ రెడ్డి, జనార్దన్ రెడ్డి మరియు ఇతర ప్రముఖుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఎంపీటీసీ అభ్యర్థిగా నిమ్మకాయల శ్రీనివాసరెడ్డి సోమవారం ఎన్నికల అధికారులకు బీ-ఫారం దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమ,అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదని, తనను గెలిపిస్తే చెన్నూరు, ఇసుకపల్లి, మోత్కుపల్లి గ్రామాలను గంగుల సహకారంతో అన్ని విధాలా అభివృద్ధి చేస్తానాని ఆయన అన్నారు. చెన్నూరు ఎంపీటీసీ స్థానంలో వైసీపీ తరపున విస్తృత ప్రచారం నిర్వహించి విజయమే ధ్యేయంగా కృషి చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ ముఖ్య నాయకులు, యూత్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### ముఖ్యమంత్రి అత్యవసర సమీక్ష.. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

### అక్టోబర్ 27, 28 తేదీల్లో స్థానిక సెలవు.. విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేత

### జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 26 నంది పత్రిక** భారీ నుంచి అతి భారీ వర్షాలు, తుపాను ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన అత్యవసర సమీక్ష, వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలు మేరకు తూర్పు గోదావరి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా నిబంధనలను పాటిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హజరవ్వడం జరిగింది.రాష్ట్ర వ్యాప్తంగా భారీ అతి భారీ వర్షాలు నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలు అనుసరించి ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది.వాతావరణ శాఖ హెచ్చరికలు అనుసరించి జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచాలని, వర్షాలు, వరదల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, వాగులు, వంకలు, నదీ పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, పునరావాస కేంద్రాలను సిద్ధం చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, రహదారులకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని, అత్యవసర సేవలను అందించేందుకు సిబ్బంది, అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు, భద్రతా సూచనలు అందించాలని పేర్కొన్నారు.

విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు రోజులు స్థానిక సెలవుభారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లాలో స్థానిక సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ రెండు రోజులు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు మూసివేయాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఈ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులకు ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

జిల్లాలో చేపట్టిన ముందస్తు చర్యలు, శాఖల వారీగా సంసిద్ధతపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని పేర్కొన్నారు.

**అత్యవసర కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు**

– జిల్లా కలెక్టరేట్, రాజమహేంద్రవరం: 08832-944455 – సబ్ కలెక్టర్ కార్యాలయం, రాజమహేంద్రవరం: 08832-442344

– ఆర్డీవో కార్యాలయం, కొవ్వూరు: 08813-231488

భారీ వర్షాలు, వరదలు, నీటి నిల్వలు, రహదారులపై ఇబ్బందులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు సంబంధిత కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అధికార యంత్రాంగం నుంచి వెలువడే హెచ్చరికలు, సూచనలు పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

### పోలింగ్ కేంద్రాలు, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి

### బ్యాలెట్ బాక్సుల పనితీరును తనిఖీ చేసి, ఎన్నికల సామగ్రి భద్రతపై సమీక్ష




**నంద్యాల బ్యూరో, అక్టోబరు 26(నంది పత్రిక):-** మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ను జనరల్ అబ్జర్వర్ పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే ప్రక్రియ సజావుగా జరిగేలా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఎన్నికల సామగ్రి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలిస్తూ, నిర్దేశిత నిబంధనల ప్రకారం భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఓటర్లు సౌకర్యవంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో వినియోగించే బ్యాలెట్ బాక్సుల పనితీరును పరిశీలించి, వాటి వినియోగానికి సంబంధించి అవసరమైన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో క్రమబద్ధమైన ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి భద్రత, సిబ్బందికి అవసరమైన సదుపాయాలు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, నోడల్ అధికారి శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.




### జిల్లాలో నగరపాలక పురపాలక సంఘాలు జడ్పిటిసి ఎంపిటిసి పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కె వేట్రి సెల్వి

**ఏలూరు బ్యూరో చీఫ్, అక్టోబర్, 26 నంది పత్రిక:** జిల్లాలో నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలు, జెడ్పిటిసి, ఎంపిటిసి పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లాలో నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలు, జెడ్పిటిసి, ఎంపిటిసి పోలింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తో కలిసి అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియపై పోలింగ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించాలన్నారు. ఎక్కడా ఎటువంటి పొరపాటు లేకుండా పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలన్నారు. పోలింగ్ ముందు రోజు పోలింగ్ సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ అందించి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పంపాలని, ఇందుకు సంబంధించి వాహనాల వెళ్లే మార్గానికి సంబంధించి రూట్ మ్యాప్ ని సిద్దంచేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గంలో బస్సులు వంటి భారీ వాహనాలకు అనుకూలంగా ఉన్నాయో,లేదో ముందుగా సెక్టోరల్, రూట్ అధికారులు పరిశీలించుకోవాలని, అందుకు తగినవిధంగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్లతో పోలింగ్ నిర్వహణ ఉంటుంది, కావున బ్యాలెట్ బాక్సులు స్థితిని ముందుగానే పోలింగ్ అధికారులు పరిశీలించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రారంభానికి ముందు పోలింగ్ ఏజెంట్లకు ఖాళీ బ్యాలెట్ బాక్స్ ను చూపించాలని, బ్యాలెట్ పత్రాలు, నమోదు రిజిస్టర్లు, పోలింగ్ కు ముందుగానే సిద్దంచేసుకోవాలన్నారు. ఓటర్లు ఎక్కువసేపు వేచి ఉండకుండా, త్వరితగతిన పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలకు తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ద్వారాలు, కిటికీలు పనిచేసే స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలు, జెడ్పిటిసి, ఎంపిటిసి పోలింగ్ ప్రక్రియకు పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ సామాగ్రితోపాటు, పోలింగ్ సిబ్బంది ఉన్న వాహనానికి పోలీసు సిబ్బందితో భద్రత కల్పించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో అనుమతిలేని వ్యక్తులకు ప్రవేశం లేదన్నారు. బ్యాలెట్ పేపర్లతో పోలింగ్ నిర్వహణ ఉంటుంది, కావున వాటికి నష్టం కలిగించే నీరు, ఇంకు వంటి వాటిని పోలింగ్ కేంద్రంలో ఉంచకూడదన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ప్రజలకు సూచనలు అందించేందుకు లౌడ్ స్పీకర్లు ఏర్పాటుచేయాలన్నారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడకుండా ఓటర్ల క్యూ ని సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోని పలు మార్గాలు ఉన్నప్పటికీ ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను మినహా, మిగిలిన వాటిని మూసివేయించాలన్నారు.జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓ లు లక్ష్మి ప్రసన్న, రమణ, పంచాయతీరాజ్ ఎస్ఈ జెడ్. రమేష్, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్ఓ లు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ప్రభృతులు పాల్గొన్నారు.



# హెచ్ఐవీ,ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాల సాధనకు సమన్వయంతో కృషి చేయాలి





### హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 26 నంది పత్రిక** జిల్లాలో హెచ్ఐవీ,ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, వారిపై ఎలాంటి వివక్ష చూపకుండా అవసరమైన వైద్య సేవలు, సహాయ సహకారాలు అందించాలని సూచించారు.సోమవారం కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఛాంబర్లో హెచ్ఐవీ,ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలు పురోగతి జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తుల పట్ల ఎవరూ వివక్ష చూపకూడదని, వారిని అవమానించేలా లేదా వారి హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు.వారికి అవసరమైన వైద్య సేవలు, చికిత్స, ఆరోగ్య సలహాలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఐవీ,ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ, అపోహలు మరియు వివక్షను తొలగించేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో హెచ్ఐవీ,ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాల వివరాలు, లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను జిల్లా సహయోగిగౌరి, కలెక్టర్‌కు వివరించారు.

**95-95-95 లక్ష్యాలపై సమీక్ష**

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం నిర్దేశించిన లక్ష్యాలు హెచ్ఐవీ నియంత్రణలో కీలకమైనవని సమావేశంలో వివరించారు. ఈ లక్ష్యాల ముఖ్య ఉద్దేశం హెచ్ఐవీతో జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ తమ ఆరోగ్య స్థితిపై అవగాహన కల్పించడం, అవసరమైన చికిత్స అందించడం, వైరస్ వ్యాప్తి ప్రమాదాన్ని తగ్గించే స్థాయిలో వైరల్ లోడ్‌ను నియంత్రించడం. మొదటి 95 శాతం లక్ష్యం: హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో కనీసం 95 శాతం మందికి తమ హెచ్ఐవీ స్థితి గురించి తెలిసి ఉండాలి. ఇందుకోసం హెచ్ఐవీ పరీక్షలపై అవగాహన పెంపొందించడం, అవసరమైన వారికి పరీక్షా సేవలను అందుబాటులో ఉంచడం ముఖ్యం.

రెండవ 95 శాతం లక్ష్యం: తమ హెచ్ఐవీ స్థితి తెలిసిన వారిలో కనీసం 95 శాతం మంది యాంటీ రెట్రోవైరల్ థెరపీ చికిత్స పొందుతూ ఉండాలి. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి సకాలంలో చికిత్స ప్రారంభించడం, మందులను క్రమం తప్పకుండా తీసుకునేలా ప్రోత్సహించడం ఈ లక్ష్యంలో భాగం.మూడవ 95 శాతం లక్ష్యం: ఏ ఆర్ టి చికిత్స పొందుతున్న వారిలో కనీసం 95 శాతం మందిలో వైరల్ లోడ్ నియంత్రణలో ఉండాలి. ఇందుకోసం నిరంతర వైద్య పర్యవేక్షణ, మందుల క్రమబద్ధమైన వినియోగం, అవసరమైన వైరల్ లోడ్ పరీక్షలు కీలకం.జిల్లాలో లక్ష్యాల సాధనకు మరింత కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి బాబు అన్నారు .జిల్లాలో హెచ్ఐవీ,ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల ప్రస్తుత స్థితిగతులను సమావేశంలో వివరించారు. జిల్లాలో ప్రస్తుతం మొదటి 95 లక్ష్యం 88 శాతం, రెండవ 95 లక్ష్యం 91.66 శాతం, మూడవ 95 లక్ష్యం 97.55 శాతంగా ఉన్నట్లు తెలిపారు. మూడవ లక్ష్యంలో నిర్దేశిత 95 శాతం లక్ష్యాన్ని జిల్లా అధిగమించగా, మొదటి, రెండవ లక్ష్యాల్లో మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని సమీక్షలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో హెచ్ఐవీ పరీక్షలపై అవగాహన పెంపొందించడం, హెచ్ఐవీ స్థితి తెలిసిన ప్రతి ఒక్కరికీ అవసరమైన ఏ ఆర్ టి చికిత్స అందించడం, చికిత్స పొందుతున్న వారు క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా పర్యవేక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని చర్చించారు.

**మందుల వినియోగంపై ప్రత్యేక దృష్టి**

ఆగస్టు నెలతో పోలిస్తే సెప్టెంబర్ నెలలో యాంటీ రెట్రోవైరల్ థెరపీ మందులు తీసుకుంటున్న వారి పరిస్థితి మెరుగుపడినట్లు అధికారులు వివరించారు. ఈ పురోగతిని కొనసాగిస్తూ, చికిత్స మధ్యలో నిలిపివేయకుండా హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి నిరంతర వైద్య సేవలు అందించాలని సమావేశంలో చర్చించారు.హెచ్ఐవీ నియంత్రణలో ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స, మందుల క్రమబద్ధమైన వినియోగం, వైద్యుల సూచనల మేరకు నిరంతర పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సంబంధిత వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, ఇతర భాగస్వామ్య విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ 95-95-95 లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు.

**హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తుల పట్ల వివక్షకు తావులేదు**

హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తులకు వైద్య సేవలు అందించడంతో పాటు, సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు అవసరమైన సహకారం అందించడం కూడా ముఖ్యమని ఈ సమీక్ష సమావేశంలో జిల్లా హెచ్ఐవీ పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐపై భారీ పెట్టుబడులు.. 60,000 మంది ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్!

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తమ ఉద్యోగులకు ఒక కీలకమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో, ఖర్చులను నియంత్రించేందుకు సుమారు 60,000 మంది ఉద్యోగులకు స్వచ్ఛంద నిష్క్రమణ పథకాన్ని (వాలంటరీ ఎగ్జిట్ ఆఫర్) అందుబాటులోకి తెచ్చింది. భారత్, అమెరికా, కెనడా, యూకేలలోని అర్హులైన ఉద్యోగులకు ఈ అవకాశం కల్పించింది.సోమవారం కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ అమీ కోల్‌మన్ ఈ విషయాన్ని ఉద్యోగులకు ఒక అధికారిక బ్లాగ్ పోస్ట్ ద్వారా తెలియజేశారు. ఇది పరిమిత కాల ఆఫర్ అని, అర్హులైన ఉద్యోగులు ఆర్థిక మద్దతు, కెరీర్ ప్లానింగ్ వనరులతో కంపెనీ నుంచి వైదొలగవచ్చని ఆమె పేర్కొన్నారు. లెవల్ 70, అంతకంటే తక్కువ స్థాయిలో ఉన్న ఉద్యోగులు దీనికి అర్హులు. దాదాపు 2,23,000 మంది ఉద్యోగులున్న మైక్రోసాఫ్ట్‌లో ఇది సుమారు 27 శాతం మందికి వర్తించనుంది.

అయితే, ఈ ఆఫర్ అన్ని విభాగాలకు వర్తించదు. కంపెనీ వ్యాపార ప్రాధాన్యతలను బట్టి కొన్ని టీమ్‌లకు మాత్రమే దీన్ని అందిస్తున్నారు. కోపైలట్, కోర్‌ఏఐ, విండోస్, ఎక్స్‌బాక్స్, ఫైనాన్స్, హెచ్‌ఆర్ వంటి విభాగాలు ఈ జాబితాలో ఉన్నాయి. అదే సమయంలో మార్కెటింగ్, కమర్షియల్ బిజినెస్, సెక్యూరిటీ వంటి కొన్ని టీమ్‌లను దీని నుంచి మినహాయించారు.

ఏఐ కంప్యూటింగ్, క్లౌడ్ సామర్థ్యాన్ని పెంచేందుకు మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్లపై భారీగా ఖర్చు చేస్తోంది. 2026 క్యాలెండర్ సంవత్సరంలో దాదాపు 175 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం చేయనున్నట్లు అంచనా. ఈ భారీ పెట్టుబడులను సమన్వయం చేసుకునేందుకే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆఫర్‌ను స్వీకరించే ఉద్యోగులు డిసెంబర్‌లోగా తమ నిర్ణయాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. అంగీకరించిన వారు డిసెంబర్ 31న కంపెనీ నుంచి నిష్క్రమిస్తారు.

ఈ ఏడాది జులైలో మైక్రోసాఫ్ట్ సుమారు 4,800 మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. అమెరికా వెలుపల భారత్‌లోనే మైక్రోసాఫ్ట్‌కు అత్యధిక ఉద్యోగులు ఉన్నారు.

ఈ నేపథ్యంలో ఇక్కడి ఉద్యోగులపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. ఇది తప్పనిసరి తొలగింపు కానప్పటికీ, ఏఐ భవిష్యత్తుకు అనుగుణంగా కంపెనీ తన వర్క్‌ఫోర్స్‌ను పునర్వ్యవస్థీకరించుకోవడంలో ఇదొక కీలకమైన అడుగుగా టెక్ నిపుణులు భావిస్తున్నారు.



# తుఫాను నివారణ చర్యలకు జిల్లా యంత్రాంగం సర్వత్ర సన్నద్ధం.

**లంక ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.**

**పునరావాస కేంద్రాలు, కంట్రోల్ రూమ్‌లను సిద్ధం చేయాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 26 నంది పత్రిక** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం దృష్ట్యా అక్టోబర్ 27, 28 తేదీల్లో అత్యంత తీవ్ర తుఫాను వలన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం గూగుల్ మీట్ ద్వారా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, సివిల్ సప్లై, ఫిషరీస్, సాంఘిక సంక్షేమ, ఐసిడిఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ట్రాన్స్‌కో, విద్య, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, వ్యవసాయ, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తదితర శాఖల అధికారులతో తుఫాను, భారీ వర్షాల నేపథ్యంలో శాఖల వారీగా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ** భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, అత్యవసర సేవలకు అవసరమైన సిబ్బంది, పరికరాలు, సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు తెలిపారు.

**అత్యవసర వైద్య సేవలు** లోతట్టు ప్రాంతాలు, లంక గ్రామాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను అవసరమైన సందర్భాల్లో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ముఖ్యంగా లంక గ్రామాల్లోని వృద్ధులు, వికలాంగులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవసరమైన పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ తాగునీరు, పాలు, ఆహారం, మందులు, ప్రథమ చికిత్స కిట్లు, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలిపారు. పునరావాస కేంద్రాల్లోని ప్రజలకు పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు.

అంగన్వాడి కేంద్రాల్లోని గర్భిణీలు, చంటిబిడ్డ తల్లులకు ఎప్పటికప్పుడు పాలు, గుడ్లు ఆహారం అందే విధంగా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ అధికారులను తెలిపారు. అంగన్వాడి సూపర్వైజర్లు ప్రజలకు ఇవ్వవలసిన ఆహారం, గర్భిణులను ఆసుపత్రిలో చేర్పించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. సాంఘిక సంక్షేమ, బీసీ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ హాస్టల్లో ఉన్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా హాస్టల్ వార్డెన్ లు నిరంతరం అక్కడే నివాసం ఉండేలా చూడాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను తెలిపారు. జిల్లాలో వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలలోని ఎఫ్.పి షాపులకు నిత్యవసర సరుకును పంపిణీకి సిద్ధంగా ఉంచాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు ఉన్న ప్రాంతాలకు తప్పనిసరిగా అందచేయాలని తెలిపారు.

**కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలి.**

**జిల్లా స్థాయిలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్**

ఫోన్ అబఎవతీ 08816299181 ఏర్పాటు చేయడంతో పాటు, అన్ని మండల కేంద్రాల్లో ఇప్పటికే ఉన్న కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తం చేయాలని తెలిపారు.

తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

భారీ వర్షాల కారణంగా కాలువలు, డ్రైనేజీలను ముందుగానే శుభ్రం చేసి నీరు నిల్వ ఉండకుండా ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. కాలువలు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక, తూడు, తూటికాడ తదితర అడ్డంకులను తొలగించి, వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా మోటార్లు, ఇతర అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

భారీ వర్షాల వల్ల జాతీయ రహదారులు, ప్రధాన రహదారులు, ఇతర రహదారులు దెబ్బతిన్నా, నీటితో మునిగినా వెంటనే స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సంబంధిత నేషనల్ హైవేస్, రహదారుల శాఖ అధికారులకు తెలిపారు. రోడ్ల వెంట ఎక్కడైనా చెట్లు పడిపోతే వెంటనే వాటిని తొలగించే విధంగా అవసరమైన కట్టారులను ఏర్పాటు చేసుకోవాలని ఆర్ఎంబి శాఖ అధికారులకు తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద అవసరమైన హెచ్చరికలు ఏర్పాటు చేయాలని సూచించారు. భారీ వర్షాలు, తుఫాను సమయంలో తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతినే ప్రమాదం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన విద్యుత్ స్తంభాలు, మోటార్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన నీటి నిల్వలు, ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. విద్య సంస్థల భవనాల్లో స్లాబులు పెచ్చులు పడే అవకాశం ఉన్న వాటిని ముందుగానే గుర్తించి ఖాళీ చేయించాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించే అంశంపై నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. భారీ వర్షాల కారణంగా రైతుల పంట పొలాలు ముంపునకు గురికాకుండా, రైతులకు నష్టం కలగకుండా వ్యవసాయ అధికారులు రైతులకు ముందస్తు జాగ్రత్త చర్యలపై వ్యవసాయ అధికారులు సూచనలు చేయాలని తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం దృష్ట్యా మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దు అని తెలిపారు. ఆక్వా రైతాంగానికి ముందస్తు చర్యలపై అవగాహన కలిగించాలని తెలిపారు. వరదలు సంభవించిన వేళ సహాయ చర్యల నిమిత్తం లైఫ్ జాకెట్లు, సిమ్మర్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని మత్స్య శాఖ అధికారులను తెలిపారు.

**పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

వీధులలో భారీ వర్షాల వలన రోడ్లు, డ్రైన్లు మునిగిపోకుండా మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు నీటిని, చెత్తను తొలగించే విధంగా పారిశుద్ధ్య సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అన్నారు. వాతావరణ శాఖ జారీ చేసిన అధికారిక వెబ్సైట్ లో అన్ని శాఖల అధికారులు తమ ప్రణాళికలను, చేపట్టనున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు డేటాను అప్లోడ్ చేయాలని తెలిపారు. జిల్లాలో తుఫాను, భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గూగుల్ మీట్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరీ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ నేపథ్యంలో ధాన్యం, పంటల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 26 నంది పత్రిక** ఆర్నబ్ తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లాలో రైతులు తమ పంటలను, కోతలు పూర్తయిన ధాన్యాన్ని సురక్షితంగా భద్రపరుచుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ 202627 సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. తుఫాన్ దృష్ట్యా రైతులకు పంటల రక్షణపై తగిన సూచనలు అందించాలని, ఇప్పటికే కోతలు పూర్తిచేసిన రైతులు తమ ధాన్యాన్ని సురక్షితంగా భద్రపరుచుకునేందుకు సమీపంలోని రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని ఆదేశించారు. ఈ నెల 31వ తేదీలోగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, గోనె సంచులు, కార్మికులు సహా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కోఆపరేటివ్ అధికారిని ఆదేశించారు. రైస్ మిల్లర్ల నుంచి అవసరమైన గోనె సంచులను సేకరించి రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారులకు సూచించారు. అదేవిధంగా, నియమిత రైస్ మిల్లర్ల నుంచి ఈ నెల 31వ తేదీలోగా అవసరమైన ఎలక్ట్రానిక్ బ్యాంక్ గ్యారంటీలను సేకరించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా మేనేజర్లను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహించే టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, కస్టోడియన్ అధికారులకు నిర్దేశిత గడువులోగా శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. కనీస మద్దతు ధర ,ధాన్యం నాణ్యత ప్రమాణాలు ( వాట్సాప్ షెడ్యూలింగ్, బయోమెట్రిక్ విధానాలపై గ్రామసభలు, మైక్ ప్రకటనలు, టమాటా బండ్ల ద్వారా ప్రచారం మార్గాల్లో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ధాన్యం సేకరణ, రవాణాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో వాహనాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను గుర్తించి, వాటికి జీపీఎస్ పరికరాలు అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు ధాన్యం సేకరణ ప్రారంభానికి ముందే అవసరమైన బ్యాంక్ గ్యారంటీలను నాణ్యమైన గోనె సంచులను సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు.

ధాన్యం విక్రయ సమయంలో రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కంట్రోల్ రూమ్ నంబర్ 81216 76653 కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆమె అన్నారు. రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తుఫాన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతుల పంటలు, ధాన్యానికి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ఖరీఫ్ 202627 ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ స్పష్టం మైన ఆదేశాలను జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, డీఎస్ఓ ఎన్.సరోజ, వ్యవసాయ శాఖ, కోపరేటివ్ ట్రాన్స్ పోర్ట్ ,మార్కెటింగ్ , లీగల్ మెట్రాలజీ , ఎం ఎల్ వో లు, సీఎస్ డీటీలు సి ఎస్ ఆర్ ఐ లు, తదితరులు పాల్గొన్నారు..

## తుఫాన్ నేపథ్యంలో ధాన్యం, పంటల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ**

**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 26 నంది పత్రిక** ఆర్నబ్ తుఫాన్ ప్రభావం దృష్ట్యా జిల్లా లో రైతులు తమ పంటలు, కోతలు పూర్తయిన ధాన్యాన్ని సురక్షితంగా భద్రపరుచుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఛాంబర్ నుండి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ 202627 సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. తుఫాన్ దృష్ట్యా రైతులకు పంటల రక్షణపై తగిన సూచనలు అందించాలని, ఇప్పటికే కోతలు పూర్తిచేసిన రైతులు తమ ధాన్యాన్ని సురక్షితంగా భద్రపరుచుకునేందుకు సమీపంలోని రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ రైతులకు అవసరమైన టార్పాలిన్లు జిల్లాలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఈ నెల 31వ తేదీలోగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, గోనె సంచులు, కార్మికులు సహా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ,రైస్ మిల్లర్ల నుంచి అవసరమైన గోనె సంచులను సేకరించి రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని రైస్ మిల్లర్ల నుంచి ఈ నెల 31వ తేదీలోగా అవసరమైన ఎలక్ట్రానిక్ బ్యాంక్ గ్యారంటీలను సేకరించాలని సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహించే టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, కస్టోడియన్ అధికారులకు నిర్దేశిత గడువులోగా శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. కనీస మద్దతు ధర ,ధాన్యం నాణ్యత ప్రమాణాలు ( వాట్సాప్ షెడ్యూలింగ్, బయోమెట్రిక్ విధానాలపై గ్రామసభలు, మైక్ ప్రకటనలు, టామ్ టామ్ బండ్ల ద్వారా ప్రచారం మార్గాల్లో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ధాన్యం సేకరణ, రవాణాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో వాహనాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను గుర్తించి, వాటికి జీపీఎస్ పరికరాలు అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు ధాన్యం సేకరణ ప్రారంభానికి ముందే అవసరమైన బ్యాంకు, గ్యారంటీలను నాణ్యమైన గోనె సంచులను సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ధాన్యం విక్రయ సమయంలో రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కంట్రోల్ రూమ్ నంబర్ 81216 76653 కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆమె అన్నారు. రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాన్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతుల పంటలు, ధాన్యానికి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ఖరీఫ్ 202627 ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ స్పష్టం మైన ఆదేశాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, డీఎస్ఓ ఎన్.సరోజ, వ్యవసాయ శాఖ, కోపరేటివ్ ట్రాన్స్ పోర్ట్ ,మార్కెటింగ్ , లీగల్ మెట్రాలజీ , ఎం ఎల్ వో లు, సీఎస్ డీటీలు సి ఎస్ ఆర్ ఐ లు, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియ నూరు శాతం నమోదు కావాలి.

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం, బ్యూరో చీఫ్ అక్టోబర్26 నంది పత్రిక** ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియ నూరు శాతంనమోదు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం వశిష్ట సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియపై పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో వివిధ విద్యాసంస్థలకు చెందిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల, పాఠశాలల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తూర్పు- పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినందున అర్హులైన ప్రతి ఉపాధ్యాయ ఓటర్లు నమోదు ప్రక్రియ నూరు శాతం నమోదు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాల కు తెలిపారు. ఓటర్ల నమోదు కావాలనుకునే ఉపాధ్యాయులు ఫారం- 19 లో దరఖాస్తుతో పాటు 1-11-2026 తేదీ నాటికి గడిచిన ఆరు సంవత్సరాల కాలంలో 3 సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాల, కళాశాలల్లో టీచర్, లెక్చరర్ గా పనిచేస్తున్నట్లు ధ్రువీకరిస్తూ సంబంధిత విద్యా సంస్థ అధిపతి నుండి ధ్రువీకరణ పత్రాన్ని కలిగి ఉండాలని తెలిపారు. నమోదు ప్రక్రియకు సంబంధించి ఫామ్ -19తో పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ప్రభుత్వ పాఠశాల కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, లెక్చరర్లు అనుబంధం -×× పై సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి, ప్రిన్సిపాల్ తో ధ్రువీకరించాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు అనుబంధం -×× పై ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్ ధ్రువీకరణతోపాటు డిఇఓ, ఆర్ ఐ ఓ, ఆర్ జె డి లతో కూడా తప్పనిసరిగా కౌంటర్ సంతకం చేయించాలని తెలిపారు. వీటితోపాటు అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు వివరాలను జత చేయాలని తెలిపారు. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాల, కళాశాల, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో, కళాశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్ ఐ ఓ, ఆర్ జె డీలచే అనుబంధం-×× నందు తప్పనిసరిగా కౌంటర్ సంతకం చేయించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం నందు ఓటరుగా నమోదు కు 6.11.2026 తేదీ చివరి నాటికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఓ వి ఎస్ అనిల్ కుమార్, వివిధ విద్యా శాఖల కళాశాలలు, పాఠశాలల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్నికల వ్యయ పరిశీలకులు అహ్మద్ అబ్దుల్ రావుప్ షేక్.

**ఎన్నికల వ్యయాల పర్యవేక్షణలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం, బ్యూరో చీఫ్ అక్టోబర్,26** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమించిన అహ్మద్ అబ్దుల్ రావుప్ షేక్ సోమవారం భీమవరంలోని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల వ్యయాల పర్యవేక్షణ, ఎన్నికల ఖర్చులకు సంబంధించిన నిబంధనల అమలు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పాటించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత అధికారులు సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకుల నియామకం ద్వారా ఎన్నికల సమయంలో అభ్యర్థులు చేసే ఖర్చులపై నిబంధనలకు అనుగుణంగా పర్యవేక్షణ చేపట్టేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుందని అన్నారు. ఎన్నికల వ్యయాలకు సంబంధించిన మార్గదర్శకాలను అమలు చేస్తూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా చర్యలు చేపట్టనున్నామన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందన్నారు.

## మహర్షి వాల్మీకి జీవితం, ఆయన రచనలు సమాజానికి స్ఫూర్తిదాయకం

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**




**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 26 నంది పత్రిక**మహర్షి వాల్మీకి జీవితం, రచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సోమవారం భీమవరం కలెక్టరేట్లోని వశిష్ట సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. రామాయణం ద్వారా మానవీయ విలువలు, ధర్మబద్ధమైన జీవనం, సత్యనిష్ఠ, కర్తవ్యపాలన వంటి గొప్ప సందేశాలను సమాజానికి అందించారని తెలిపారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన బోధనలు నేటి సమాజానికి కూడా ఎంతో మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ నైతిక విలువలను పాటిస్తూ, సమాజంలో మానవతా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియా, జిల్లా విద్యాశాఖ అధికారి అనిల్ కుమార్, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అప్పారావు, బీసీ సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ ఝాన్సీ లక్ష్మీబాయి, నర్సాపురం ఏబీసీడబ్ల్యూఓ ఇన్‌చార్జి విద్యాసాగర్, హాస్టల్ వార్డెన్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# అర్నాబ్ తుఫాను ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**అక్టోబర్ 27, 28 తేదీల్లో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దు.**

**గంటకు 115120 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం.**

**తీర ప్రాంతాల్లోని 14 మత్స్యకార గ్రామాల్లో తుఫాను షెల్టర్లు సిద్ధం.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**

**భీమవరం బ్యూరో చీఫ్, అక్టోబర్,26 నంది పత్రిక.** అర్నాబ్ తుఫాను ముప్పు నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తన చాంబర్లో ప్రజలకు ముందస్తు జాగ్రత్తచర్యలనుద్దేశించి మాట్లాడుతూపశ్చిమగోదావరి జిల్లాలో అక్టోబర్ 27, 28 తేదీల్లో అర్నాబ్ తుఫాను ముప్పు నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.తుఫాను ప్రభావంతో గంటకు 115 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని తెలిపారు.

**ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యత** తుఫాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అత్యవసర పనులు మినహా ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, బలహీనమైన చెట్లు, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలకు దూరంగా ఉండాలని తెలిపారు. తీర ప్రాంత ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని తెలిపారు. రాబోయే రెండు మూడు రోజులు ప్రజలు ఎవరు సముద్రం వైపు విహారానికి వెళ్లడం, సముద్రంలో స్నానాలు చేయడం వంటి పనులకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**27, 28 తేదీల్లో విద్యా సంస్థలకు సెలవులు.**

తుఫాను ప్రభావం దృష్ట్యా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా అక్టోబర్ 27, 28 తేదీల్లో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**అన్ని శాఖల అధికారులు అప్రమత్తం** తుఫాను వల్ల ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా పోలీసు, రెవెన్యూ, రోడ్లు, భవనాల శాఖ, ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్, విద్యుత్ శాఖ తదితర అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.భారీ గాలుల కారణంగా చెట్లు కూలిపోవడం, రహదారులకు అంతరాయం కలగడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటం వంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన వాహనాలు, పరికరాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించి రహదారులను పునరుద్ధరించేందుకు, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సంబంధిత శాఖలు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

**తీర ప్రాంతాల్లో 14 మత్స్యకార గ్రామాలకు భద్రత**

తీర ప్రాంత ప్రజలనెబ ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని 14 మత్స్యకార గ్రామాల్లో ప్రజలకు అవసరమైన రక్షణ కల్పించేందుకు స్థానిక తుఫాను షెల్టర్లను సిద్ధం చేసి, అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు.తుఫాను ప్రభావం పెరిగే పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో ని ప్రజలు కు తాగునీరు, పాలు, మందులు, ప్రథమ చికిత్స కిట్లు, అత్యవసర వైద్య సహాయం అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు.



లిప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుఫాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 08816299181 గా తెలిపారు.ప్రజలు తుఫాను కారణంగా ఏవైనా ఇబ్బందులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదుర్కొంటే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

**జిల్లా యంత్రాంగానికి ప్రజలు సహకరించాలి**

తుఫాను సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఇతర శాఖల అధికారులు అందించే సూచనలకు అనుగుణంగా వ్యవహరించాలని కోరారు.

ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని, తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు

# నల్లగట్లలో వైసీపీని వీడి టిడిపిలో 50 కుటుంబాలు

# ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సమక్షంలో చేరిక





## నల్లగట్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 26 నంది పత్రిక.** ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామంలో వైసిపికి చెందిన అనుముల లక్ష్మీపతి బద్రి భాస్కర్ బదిరి రామలింగయ్య అరటి రవి బోయ రామకృష్ణ దండు భాస్కర్లతోపాటు మరో 50 కుటుంబాలు వైసిపిని విడి టిడిపి పార్టీలో చేరాయి వారందరికీ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ గతంలో భూమా నాయుడుతో కలిసి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు మళ్లీ తమ కుటుంబములకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు భూమా కుటుంబానికి రాజకీయాల కంటే ప్రజలతో ఉండే అనుబంధం ముఖ్యమని గతంలో భూమా నాగిరెడ్డి కార్యకర్తలను ఏ విధంగా ఆప్యాయంగా చూసుకున్నా రో అదే ఆప్యాయత ఆదరణ తమ దగ్గర కూడా ఉంటాయని ఆమె హామీ ఇచ్చారు టిడిపిలోకి వచ్చిన వారిని కొత్త వారిగా కాకుండా తమ సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తామని పాతవారు కొత్తవారు అని తేడా లేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు గ్రామాభివృద్ధి ప్రధాన లక్ష్యం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు భూమా కుటుంబం పై ప్రజలకు ఉన్న నమ్మకమే ఈ చేరికలకు ప్రధాన కారణమని ఎమ్మెల్యే అన్నారు పదవులు హోదాలు ఆశించకుండా తమ గ్రామానికి రోడ్లు డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ నాయకులు తమ వద్దకు రావడం సంతోషంగా ఉందన్నారు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టడమే తమ ప్రాధాన్యమని ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయబోమని తెలిపారు. నల్లగట్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యంనల్లగట్ల గ్రామంలో ఇప్పటికే 30 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మూడో విడతలో మరో 20 లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు భవిష్యత్తులో గ్రామానికి అవసరమైన రోడ్లు కాలువలు ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు గ్రామాల్లో ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుంటూ గ్రీవెన్స్ కార్యక్రమాల ద్వారా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు వైసీపీ పాలన పై విమర్శలు చేస్తూ గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విమర్శించారు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో గత పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారం నాయకుల పనితీరు వేరే చేసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. అంతకుముందు నల్లగట్ల గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు టిడిపి నాయకులు కార్యకర్తలు, భూమా అభిమానులు ఘన స్వాగతం పలికారు.

# అధికారపీఠం కోసం వివేకహీన వ్యూహం!

అమెరికాలో గత కొన్నేళ్లుగా శ్వేత జాత్యాహంకారం పెరుగుతూపోతోంది. దీనికి ముఖ్య కారణం ఆర్థిక అసమానత్వం పెరిగిపోవడమూ, దానివల్ల సామాన్య అమెరికన్ల జీవనం కష్టమవడమూ. ఈ అసంతృప్తిని... అమెరికాలో గత కొన్నేళ్లుగా శ్వేత జాత్యాహంకారం పెరుగుతూపోతోంది. దీనికి ముఖ్య కారణం ఆర్థిక అసమానత్వం పెరిగిపోవడమూ, దానివల్ల సామాన్య అమెరికన్ల జీవనం కష్టమవడమూ. ఈ అసంతృప్తిని ట్రంప్ లాంటి వాళ్లు తమ రాజకీయ ప్రయోజనానికి వాడుకున్నారు. ఇతర దేశాల నుంచి వలస వచ్చినవాళ్లు, అమెరికన్ల ఉద్యోగాలను దొంగిలిస్తున్నారనీ, ప్రభుత్వ నిధుల్ని దోచుకుంటున్నారనీ, ట్రంపూ అతని అనుచరులూ వలసదారుల మీద విద్వేషాన్ని రెచ్చగొట్టారు. ట్రంప్ మొదటి పదవీకాలంలో ఈ వివక్ష నల్లజాతీయుల మీదా, లాటిన్ అమెరికా వారి మీదా, అరబ్ సంతతికి చెందిన వారి మీదా ముఖ్య లక్ష్యంగా సాగింది. అమెరికాలో ఉన్న కొంతమంది భారతీయులు, ఇది తమకు లాభదాయకమని భావించి, 'ఇండియన్స్ ఫర్ ట్రంప్' అని సంఘాలు మొదలెట్టి 'లాటిన్ అమెరికా నుంచి అక్రమంగా వలస వచ్చిన వారిని మీరు దేశంలోంచి తరిమేయండి. ఇండియా నుంచి చట్టబద్ధంగా వలస వచ్చిన మాలాంటి వాళ్లకు గ్రీన్‌కార్డులు వేగంగా ఇవ్వండి' అని అడగడమూ, ట్రంప్ కోసం ఎన్నికల్లో ప్రచారం చేయడమూ, విరాళాలివ్వడమూ చేశారు.ఇలాంటి వాతావరణంలో, ట్రంపునకు చెందిన రిపబ్లికన్ పార్టీ తరఫున రాజకీయాల్లోకి దిగిన వ్యక్తి, వివేక్ రామస్వామి అనే రెండో తరం భారతీయుడు (ఇండియా నుంచి వలస వచ్చిన తల్లిదండ్రులకు అమెరికాలో పుట్టిన వ్యక్తి). ఈ వివేక్ రామస్వామి చాలా చిన్న వయసులోనే కొన్ని అనుమానాస్పద పద్ధతుల ద్వారా కొన్ని వందల మిలియన్ డాలర్లు గడించినట్టు ఆరోపణలున్నాయి. క్లినికల్ పరీక్షల్లో విఫలమైన ఒక మందుకు హక్కులు సంపాదించి, దానికి పెద్ద మార్పులేమీ చేయకుండానే ఆ మందును మెరుగుపరిచామనీ, ఇప్పుడు చాలా బాగా పనిచేస్తుందనీ ప్రకటించి... కంపెనీ షేర్లను ఎక్కువ ధరలకు అమ్ముకుని, కొన్ని వందల మిలియన్ల డాలర్లు గడించినట్టు చెబుతారు. నిజానికి ఆ మందుకీ, మొదటి మందుకీ పెద్దగా తేడా లేకపోవడం వల్ల రెండోసారి క్లినికల్ పరీక్షలో కూడా విఫలం కావడం, వివేక్ మాటలు నమ్మి కంపెనీ షేర్లు కొన్నవాళ్లు నష్టపోవడమూ జరిగిందని భోగట్టా. దీన్ని చాలామంది మోసంగా పరిగణిస్తారు, అమెరికా ప్రస్తుత చట్టాల ప్రకారం ఇది నేరం కాకపోయినా! 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నామినేషన్ కోసం వివేక్ బరిలోకి దిగగలిగింది అలా సంపాయించిన డబ్బు బలంతోనేనని అంటుంటారు. పేరుకు అభ్యర్థిత్వం కోసం ట్రంప్‌తో పోటీ పడినప్పటికీ, ట్రంప్ తనను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవాలనే ధ్యేయంతోనే వివేక్ ప్రచారం జరిగింది. 2023లో మొదటి రిపబ్లికన్ డిబేట్‌లో ట్రంప్‌ను 'ఇరవై ఒకటో శతాబ్దపు అతిగొప్ప అధ్యక్షుడి'గా వివేక్ అభివర్ణించగా, ట్రంప్ నుంచి తిరిగి వివేక్‌కూ ప్రశంసలు అందాయి. ట్రంప్ అడుగులకు మడుగులొత్తినట్టు వ్యవహరించినా, చివరికి ట్రంప్ వివేక్‌ని ఉపాధ్యక్షుడిగా ఎంచుకోలేదు. ఆఖరికి పదవిలోకి వచ్చిన తరువాత మంత్రి పదవి కూడా ఇవ్వలేదు! ఇప్పుడు వివేక్ ఈ నవంబరు నెలలో జరగబోయే ఎన్నికల్లో ఓహియో రాష్ట్ర గవర్నరు పదవికి పోటీ పడుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి. ఈ ఎన్నికల్లో వివేక్ ప్రత్యర్థి... డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి 'ఏమీ యాక్టన్'. యాక్టన్ చిన్న వయసులోనే చాలా కష్టాలు పడింది. పిల్లల వైద్యంలో ఎం.డి చేసి, తరవాత ఓహియో యూనివర్సిటీలో ప్రొఫెసరుగానూ, ఓహియో రాష్ట్ర ఆరోగ్య శాఖకు డైరెక్టరుగానూ పనిచేసిన అనుభవం ఆమెకు ఉంది. ఈ మధ్య వెలువడుతున్న సర్వేలు వివేక్ బాగా వెనకబడినట్టు చూపిస్తున్నాయి. ఉదాహరణకు అక్టోబర్ 1518 తేదీల మధ్య జరిపిన మారిస్ట్ పోల్ ప్రకారం, 50శాతం మంది ఓటర్లు యాక్టన్‌కు అనుకూలంగానూ, 43శాతం వివేక్‌కు అనుకూలంగానూ ఉన్నారు. ఈ పరిస్థితుల్లో వివేక్ నుంచి ఆఖరి ప్రయత్నంగా ఒక టీవీ ప్రకటన వచ్చింది. ఆ ప్రకటనలో వృద్ధురాలయిన యాక్టన్ తల్లి... తన కూతురు అబద్ధాలకోరు అనీ, తన జీవితమంతా అబద్ధాలాడుతూనే గడిపిందనీ, అబద్ధాలు చెప్పే అలవాటు నుంచి కోలుకోవడానికి ఆమెకే సహాయం అవసరమనీ, ఓహియో ప్రజలకు సహాయం చేసే పరిస్థితిలో తన కూతురు యాక్టన్ లేద'నీ చెప్పినట్టు ఆ వీడియోలో ఉంది.ఈ ప్రకటన వీడియో వచ్చిన వెంటనే యాక్టన్ గురించి అప్పటిదాకా ఏమీ తెలియని వారికి చాలా విషయాలు తెలిసి వచ్చాయి. అసలు యాక్టన్‌కు పన్నెండేళ్ల వయసు నుంచే తల్లితో ఎటువంటి సంబంధమూ లేదు. ఆమె తొమ్మిది నుంచి పన్నెండేళ్ల వయసు వచ్చే వరకూ తన సవతి తండ్రి చేతిలో అత్యాచారానికి గురైన విషయం అప్పట్లోనే ఆధారాలతో సహా కోర్టుదాకా వెళ్లింది. కోర్టు యాక్టన్‌నూ, ఆమె తమ్ముడినీ తల్లి కస్టడీ నుంచి విడిపించి, సొంత తండ్రికి అప్పగించింది. కోర్టులో క్రిమినల్ కేసు జరుగుతూ ఉండగానే యాక్టన్ తల్లి, తన కొత్త రేపిస్టు భర్తతో సహా రాష్ట్రం వదిలి పారిపోయింది. తరవాతి కాలంలో కొన్ని క్రిమినల్ కేసుల్లో వాళ్లిద్దరూ దోషులుగా కూడా తేలారు. సహజంగానే మీడియాలోనూ జనాలలోనూ ఈ ప్రకటనపై చాలా అసహ్యం వ్యక్తమవుతోంది. వివేక్ పార్టీకే చెందిన చాలామంది ఆ ప్రకటనను ఖండించారు. ఉదాహరణకు భారత సంతతికి చెందిన ఇంకో రిపబ్లికన్ నిక్కీహేలీ అన్న మాటలు: "వివేక్ చెడ్డవాడు. ప్రతిసారీ అతను ఈ తప్పుడు పనులతో తప్పించుకుపోవడం దురదృష్టకరం". ఇంకొక రిపబ్లికన్ కాంగ్రెస్ మెంబర్ నాన్సీమేస్ అన్న మాటలు: "ఈ ఎన్నికల సీజన్ అంతట్లోనూ ఇది అత్యంత సిగ్గుచేటయిన, అసహ్యకరమైన, అభ్యంతరకరమైన ప్రకటన". అందరూ వివేక్ విడుదల చేసిన అబద్ధపు ప్రకటనను ఖండించినా, కేవలం అమెరికా అధ్యక్షుడు ట్రంపూ, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాత్రం వివేక్‌ను సమర్థించుకొచ్చారు. ఆ ప్రకటనను ఆపు చేయవలసిన అవసరం లేదన్నారు! ఎన్నికల్లో గెలిచే అవకాశం కోసం తాను ఎంతకైనా దిగజారటానికి సిద్ధమని నిరూపించేలా ఉంది వివేక్ ప్రవర్తన. ఎంతటి వివేకహీనమైన వ్యూహం వివేక్ రామస్వామిది! ఇంతగా దిగజారినా ఓహియో ప్రజలు వివేక్‌ను ఎన్నుకుంటారా? ఏమో! చాలా రేప్ ఆరోపణలు ఉన్న ట్రంప్‌నే ఒకటి కాదు, రెండుసార్లు అమెరికా మెజారిటీ ఓటర్లు ఎన్నుకోలేదా? రేప్, హత్యారోపణలు ఉన్న వ్యక్తిని ప్రస్తుతం ఇండియాలో ఒక రాష్ట్ర గవర్నరుగా నియమించినా జనాలలో ఏమన్నా వ్యతిరేకత కనిపిస్తోందా? ఓహియో ప్రజలు ఈ సందర్భంలో కొంచెం విచక్షణ చూపిస్తారని ఆశిద్దాం.

# భావాల తుఫాను ఇప్పుడే వచ్చిందా?

పాశ్చాత్య దేశాల నుంచి ఒక తుఫాను వచ్చింది. అది అన్నిరకాల వ్యవస్థలనూ, మర్యాదలనూ, శుభప్రదమైన విలువలనూ, సంస్కృతినీ, సంస్కారాలనూ వ్యతిరేకిస్తోంది.దేశ గౌరవానికీ, ప్రతిష్ఠకూ భంగం కలిగించే శక్తులూ, సమాజాన్ని విభజించే వ్యక్తులూ, మన సంస్కృతిపై ద్వేషం చూపించే మనస్తత్వం కలిగిన వాళ్లు.. దేశానికి శత్రువులు.ప్రధాని మోదీదసరా పండుగ సందర్భంగా భగవత్, మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు చాలా తీవ్రమైనవి. పదునైనవి. మరో కోణం నుంచి చూస్తే మన సంస్కృతిలోని మంచిచెడుల వివేచనకు ఒక సందర్భాన్ని సమకూర్చేవిగానూ భావించొచ్చు! ఇస్లాం, క్రైస్తవాలను దేశ సాంస్కృతిక ఐక్యతకు నిరోధకాలుగా భావించటం మనకు కొత్తకాదు. 125 ఏళ్లకు పైగా ఆ రెండు మతాలకు వ్యతిరేకంగా ఎన్నో రూపాల్లో విమర్శలూ వ్యాఖ్యలూ వినపడుతూనే ఉన్నాయి. ఆ మతాలను తీవ్రంగా వ్యతిరేకించటానికే కొన్ని సంస్థలు పుట్టుకొచ్చాయి. వాటికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించటానికి రాజకీయపార్టీలూ అవతరించాయి. మన సాంస్కృతిక జీవితాన్ని ఏ రకంగానూ ప్రభావితం చేయలేని స్థాయికి ఆ మతాలను తీసుకెళ్లాలన్న లక్ష్యం దిశగానూ పనిచేశాయి. 1990ల తర్వాత వాటి కార్యాచరణలో అనూహ్యంగా వేగం పెరిగింది. రాజకీయాలన్నీ దాని చుట్టూనే తిరిగాయి. ఇంకా తిరుగుతూనే ఉన్నాయి. హిందూత్వ అనేది మతం కాదనీ, అదొక జీవన విధానమనీ సుప్రీంకోర్టు సైతం వ్యాఖ్యానించటంతో ఆ రాజకీయాలకు బాగా ఊపు వచ్చింది. మన జాతీయ ఐక్యత సురక్షితంగా ఉండాలంటే హిందూత్వను అందరూ ఆమోదించాలనీ, దాన్ని వ్యతిరేకిస్తున్న వాళ్లను అనుమానంతో చూడాల్సిందేనన్న దృక్పథానికి గత మూడున్నర దశాబ్దాల కాలంలో గణనీయంగా బలం పెరిగింది. భారత్‌లో ఉన్న వాళ్లందరూ మాతృభూమిని పుణ్యభూమిగా చూడాలనీ, దేశభక్తికి అదే కొలమానమనీ చెప్పటం కొంతకాలంగా మామూలైపోయింది. దేశ సరిహద్దుల అవతల పుణ్యభూములనూ, పవిత్రస్థలాలనూ (మక్కా, జెరూసలెం) చూసే వ్యక్తుల విధేయతను శంకించాల్సిన అవసరం ఉందన్న ప్రచారం కూడా చాలా దశాబ్దాలుగా సాగుతూనే ఉంది. ఇప్పుడు దానికి మించిన పరిణామాలు జరుగుతున్నాయి. కాక్రోచ్ పార్టీ పేరుతో ఆందోళనలు సాగిస్తున్న యువతను కూడా ఇప్పుడు దేశ సంస్కృతికి వ్యతిరేకులుగా భావించటం మొదలవుతోంది. భగవత్, మోదీ విమర్శలను ఈ నేపథ్యం నుంచి చూస్తేనే వాటి సందర్భశుద్ధి ఏమిటో కొంతైనా అర్థమవుతుంది. భగవత్ అయితే ఫ్రాన్స్, అల్బేనియా, బంగ్లాదేశ్, నేపాల్‌లో జరిగిన పరిణామాలను కూడా తన ఉపన్యాసంలో ప్రస్తావించారు. ఆ పరిణామాల వెనుక విదేశీశక్తుల హస్తం ఉందనీ విమర్శించారు. పాశ్చాత్య సంస్కృతి నుంచి మంచిని స్వీకరించి.. స్వేచ్ఛ, సౌభ్రాత్రం, సమానత్వం, లౌకికవాదం కావాలనీ, సమన్యాయపాలనను అమలుచేయాలనీ కోరుతున్న వాళ్లందరినీ విదేశీశక్తులుగా పరిగణిస్తే మనం మధ్యయుగాల నాటి ఆలోచనల్లోకి వెళ్లిపోతాం. అప్పుడు మన రాజ్యాంగం పునాదులనే ప్రశ్నించుకోవాల్సి వస్తుంది. చట్టం ముందు అందరూ సమానులేనన్న భావన.. మనం గతంలో అనుసరించిన సంప్రదాయక సామాజిక నీతిలో ఎప్పుడూ భాగం కాదు. ధర్మాన్ని కాపాడటం ముఖ్యకర్తవ్యంగా మన సంప్రదాయ రాజనీతి ఉండేది. ఆ నీతిలో ఒక నేరానికి అందరికీ ఒకే విధమైన శిక్షను ఊహించలేం. కులాన్ని బట్టి, వర్ణాలను బట్టి శిక్షలు ఉండేవి. మనుస్మృతితో పాటు ఇతర స్మృతుల్లో అవి చాలా స్పష్టంగానే ఉన్నాయి. వర్ణ ధర్మాన్నీ కుల కట్టుబాట్లనూ కాపాడటమే రాజుల ప్రథమ కర్తవ్యమని స్మృతులు బోధించాయి. ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా కత్తిఎత్తిన వీరులు కూడా హైందవమత సామాజిక నీతినీ, వ్యవస్థనూ పునరుద్ధరించటమే లక్ష్యంగా ప్రకటించుకున్నారు. అధికారం కోసం జరిగిన ఏ పోరాటంలోనైనా ఏదో ఒక నీతినీ, ధర్మాన్నీ పునరుద్ధరించటానికే అన్నట్లుగా ప్రకటనలూ ఉంటాయి. ఆ దిశగా ప్రజలను ప్రేరేపించటమూ ఉంటుంది. తన స్వార్థం కోసమే, తను అనుభవించటానికే అధికారాన్ని కోరుకుంటున్నట్లు ఏ రాజూ చెప్పడు. సామాజిక సమానత్వ భావనను మన భక్తికవుల్లో కొందరు గట్టిగానే ప్రచారం చేశారు. కానీ అది ప్రచారస్థాయిని దాటి స్థిరమైన రాజకీయ రూపం సంతరించుకుని, రాజ్యాంగనీతిలో, నడవడిలో ఎప్పుడూ ప్రధానభాగం కాలేదు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అసమ్మతిని తెలపటం.. దానికి మించి ప్రభుత్వాలను గద్దెదింపే స్థాయిలో ఆందోళనలు చేయటం ప్రజాస్వామ్యంలో అతి సహజం. రాజ్యాంగ పరిధిలో వాటిని చేయాలనటంలో తప్పేమీ లేదు. అలాగే హింసకు తావివ్వకుండా ఆందోళనలు చేయాలని కోరటంలో అనౌచిత్యమూ లేదు. ఆందోళనకారులందరినీ దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేసే వాళ్లుగా భావించటంలోనే ప్రమాదం ఉంది. పాశ్చాత్య భావాల స్ఫూర్తితో ఆందోళనలు చేపట్టడం ఏ రకంగానూ తప్పుకాదు. ఏ భావం ఎక్కడ పుట్టినా అది ఎక్కువ మందికి పనికొచ్చేదైతే పనిగట్టుకుని వ్యతిరేకించాల్సిన అవసరమే ఉండకూడదు. అంతదాకా ఎందుకు.. మన రాజ్యాంగమే పాశ్చాత్య భావాల స్ఫూర్తితో రూపొందింది. రాజ్యాంగసభలో ఎన్నో చర్చలు చేసి దాన్ని రూపొందించారు. మన సంప్రదాయ రాజనీతికీ, కులాల అంతస్తుల ప్రాతిపదికన ఏర్పడిన హెచ్చుతగ్గుల భావనలకు రాజ్యాంగంలో చోటు కల్పించకుండా చూడటానికే పెద్ద కసరత్తు జరిగింది. గోవధ నిషేధం, కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం వంటివి రాజ్యాంగంలో ఉన్నా వాటికి పెద్దపీట వేయలేదు. భారత రాజ్యాంగ రచనను నిశితంగా పరిశీలిస్తే మనం ఎరువు తెచ్చుకున్నవే ఎక్కువగా కనపడతాయి. 1935 నాటి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టంలో నుంచి తీసుకున్నవే అందులో అధికంగా ఉన్నాయి. బ్రిటన్, అమెరికా, ఐర్లాండు, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్సు, రష్యా, జర్మనీ, దక్షిణాఫ్రికా రాజ్యాంగాల నుంచి ఎన్నో తీసుకున్నాం. ఎరువు తెచ్చుకున్న వాటిని కొన్ని మార్పులతో మన రాజ్యాంగంలో పొందుపరచటాన్నీ అంబేద్కర్ కూడా గట్టిగా సమర్థించారు. హిందూ మహాసభ లాంటి సంస్థలు రాజ్యాంగాన్ని అప్పుడే వ్యతిరేకించాయి. సంప్రదాయ మూలాల్లేని రాజ్యాంగమూ ఒక రాజ్యాంగమేనా అంటూ విమర్శలు కురిపించాయి. హిందూ సంస్కృతినీ, వారసత్వాన్నీ నిర్లక్ష్యం చేసిందనీ గర్హించాయి. అన్ని మతాలను సమానంగా చూసే లౌకిక విధానమూ వాటికి నచ్చలేదు. మనుస్మృతి లాంటి వాటిని పరిగణనలోకి తీసుకోకపోవటాన్నీ తిట్టిపోశాయి. దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేయటానికి విదేశీ భావాలతో ప్రేరణపొంది అసమ్మతిని రాజేస్తున్నారని విమర్శించటం రాజకీయ అవసరంగానే ఉండొచ్చు. కానీ మన ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న మన రాజ్యాంగమే అలా ప్రేరణ పొందేలా చేస్తోంది. మన సంప్రదాయాల నుంచి మాత్రమే ప్రేరణ పొందాలని నిర్దేశిస్తే రాజ్యాంగానికి ఆత్మగా ఉన్న ప్రజాస్వామ్యం కనుమరుగవుతుంది. ప్రాథమిక హక్కులు కలిగించే భావనలు అంతర్ధానం అవుతాయి. పాశ్చాత్య భావాలకు అనుగుణంగా రాజ్యాంగ రూపకల్పన చేసినవాళ్లను విమర్శించాలనుకుంటే ఆనాటి ప్రధాన పాత్రధారులనే తప్పుపట్టాల్సి వస్తుంది. నెహ్రూతో పాటు సర్దార్‌పటేల్ కూడా ఆ యజ్ఞంలో ముందువరుసలోనే ఉంటారు. మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేని సంప్రదాయాలనూ, సంస్కృతినీ విమర్శించటమూ ప్రజాస్వామ్య ఆలోచనల్లో చాలా కీలకమైనది. చాలా సహజమైనది. మార్పులు కావాలనుకునే వాళ్లందరినీ విచక్షణ లేకుండా సంస్కృతిని విచ్ఛిన్నం చేసేవారుగా చిత్రీకరించటం రాజ్యాంగం పెద్దపీట వేసిన భావనలకు వ్యతిరేకమే అవుతుంది. కాక్రోచ్ ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నవారు ప్రత్యేకంగా విదేశీ భావాలతో ప్రేరణ పొందాల్సిన అవసరంలేదు. మన రాజ్యాంగానికే అటువంటి భావాలను ప్రేరేపించే శక్తి ఉంది. ఒక మతమూ, ఒక భాషా, ఒక సంస్కృతీ, భౌగోళిక ఐక్యతా పునాదులుగా ఉండే జాతీయభావం కూడా ముందుగా పాశ్చాత్య దేశాల్లోనే బలపడింది. ఆధునిక భావాల వ్యాప్తిలో భాగంగానే భారత్‌లోనూ జాతీయవాదం వేళ్లూనుకుంది. కాకపోతే ఒక భాష, మతం ఆధారంగా ఉండే జాతీయవాదం స్థానంలో బహు భాషలనూ, బహు సంస్కృతులనూ సమానంగా చూసే జాతీయవాదం భారత్‌లో రూపుదిద్దుకోవాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. మనుషులందరినీ విశ్వకుటుంబంలో భాగమనుకుంటే, విభిన్న సంస్కృతుల మధ్య ఇచ్చిపుచ్చుకోటాలు చరిత్ర పొడవునా జరగటాన్ని విస్మరించలేని వాస్తవంగా గుర్తిస్తే.. ఆందోళనకారులను విచ్ఛిన్నశక్తులుగా భావించలేం. మన సంస్కృతికి చేటుతెచ్చే సమూహాలుగా ముద్రవేయలేం. ఇతర సంస్కృతులతో ప్రభావితం కాని దేశం ప్రపంచంలో ఎక్కడా లేదు. రాజ్యాంగంలో మనం పొందుపరుచుకున్న పాశ్చాత్య భావాలతో సంప్రదాయ సంస్కృతి ఒక్కటే మారటం లేదు. మన ఆర్థిక వ్యవస్థను కూడా ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలతో ఎప్పుడో అనుసంధానం చేశాం. 1991 తర్వాత అది అనూహ్యస్థాయిలో పెరుగుతోంది. మన ఆర్థిక వ్యవస్థలోకి ఎంత ఎక్కువగా విదేశీపెట్టుబడులు వస్తే అంత గొప్పని భావించుకునే పరిస్థితుల్లో, బయట దేశాలతో ప్రేరణపొందిన శక్తులు దేశ సంస్కృతిని నాశనం చేస్తున్నాయని భావించటంలో సహేతుకత ఒకపట్టాన కన్పించదు. ఆర్థిక వ్యవస్థలతో పాటు సంస్కృతులూ ప్రయాణం చేస్తాయి. ఆ ప్రయాణంలో భాగంగా సంప్రదాయాలూ మారతాయి. రాజ్యాంగస్ఫూర్తిని మనం నిక్కచ్చిగా ఒంటబట్టించుకుంటే మన సంప్రదాయాల్లో మంచినీ చెడునీ విడదీయకుండా ఉండలేం. సంస్కృతిని వ్యతిరేకించేవాళ్లు అందులో ఏ అంశాలను విమర్శిస్తున్నారో చూడకుండా, స్పష్టంగా చెప్పకుండా ప్రచార ఉధృతితో వాళ్లను కొంతకాలం దోషులుగా బోనులో నిలబెట్టొచ్చు. అదిప్పుడు సాగుతూనే ఉంది. భగవత్ వ్యాఖ్యానించిన విధంగా పాశ్చాత్య దేశాల నుంచి ఇప్పుడు కొత్తగా వచ్చిన భావ తుఫాను అంటూ ఏమీలేదు. అలాంటి భావ తుఫానులు ఎన్నో వచ్చిన తర్వాత, మన నేలను ఎంతో ప్రభావితం చేసిన తర్వాతే మన రాజ్యాంగం రూపొందుకుంది. మన సంస్కృతి అధిక ప్రాధాన్యం ఇచ్చిన కొన్ని అంశాలపై సహేతుక ద్వేషమూ, కోపమూ కలిగిన వాళ్లు ఎప్పుడూ ఉంటారు. అంబేద్కర్ అటువంటి వాణిని బలంగానే విన్పించారు. ఆ వాణి మన సమాజంలో మంచి మార్పులకే దారితీసింది. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రగతిశీల భావాలను అక్కున చేర్చుకున్నవాళ్లు మన సంస్కృతిలోని కొన్ని అమానవీయ, అప్రజాస్వామ్య అంశాలపై విమర్శలను ఎక్కుపెడుతూనే ఉంటారు. రాజకీయ వ్యవస్థలోని అవినీతినీ, నిరంకుశ ప్రవర్తనలనూ, సమాజ సంపదను కొద్దిమంది చేతుల్లో పెట్టే ఆర్థిక వ్యవస్థనూ ప్రశ్నించేవాళ్లు పుట్టుకొస్తూనే ఉంటారు. రాజ్యాంగస్ఫూర్తి ఆ ప్రశ్నలను ఏదోరకంగా రగుల్చుతూనే ఉంటుంది. ప్రజాస్వామ్యానికి అంతకుమించిన రక్ష ఏముంటుంది?





printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com